RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది


ప్రేమతోడ గట్టె ప్రేమికురాలికి
షాజహానుగారు తాజుమహలు
విశ్వఖ్యాతి బొందె వింతైన భవనంగ
పూర్వకట్టడముగ భువనమందు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


సంచిక : 226 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | 29-11-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00



## డిసెంబర్ 4,5 తేదీల్లో ఇండియాకు పుతిన్

- ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు పుతిన్ ఇండియాకు
- డిసెంబర్ 4, 5 తేదీల్లో ఇండియాలో పుతిన్ పర్య

న్యూఢిల్లీ


రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్ 4, 5 తేదీల్లో ఇండియాలో పర్యటించనున్నారు. 23వ ఇండోరష్యా వార్షిక సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు పుతిన్ భారత్‌లో పర్యటించనున్నారు. రష్యా ఇంధనాన్ని దిగుమతి చేస్తున్న నేపథ్యంలో భారత్‌పై అమెరికా వాణిజ్య ఆంక్షలు విధిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంలో పుతిన్ రాక ప్రత్యేకత సంతరించుకోనున్నది. భారత్ పర్యటనలో మోదీ, పుతిన్ మధ్య చర్చలు జరగనున్నాయి. రాష్ట్రపతి భవన్ వద్ద రాష్ట్రపతి ముర్ము రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు స్వాగతం పలకనున్నారు. పుతిన్ రాకతో ద్వైపాక్షిక కార్యకలాపాలు మెరుగుపడుతాయన్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో ఆగస్టులో జరిగిన సమావేశంలో పుతిన్ పర్యటన గురించి ప్రకటన చేశారు. సెప్టెంబర్‌లో చైనాలో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ భేటీలో మోదీ, పుతిన్ చర్చలు జరిపారు.

# ఎత్తుకు పైఎత్తు

## రసవత్తరంగా పంచాయతీ పోరు

- పార్టీలకు అతీతమైనా ..వారిదే హవా
- వేలంపాటల ద్వారా ఏకగ్రీవాలు
- బీసీల చుట్టూ రాజకీయపార్టీలు
- జనరల్ స్థానాల్లోనూ వారికే ప్రాధాన్యత
- అభ్యర్థుల ఖర్చుపై ఎస్ఈసీ నజర్
- గ్రామీణంలో సరికొత్త రాజకీయం

నామినేషన్లకు నేడే ఆఖరు




**హైదరాబాద్ నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

గ్రామీణంలో పంచాయతీపోరు రసవత్తరంగా సాగుతోంది. పార్టీలకు అతీతంగా జరగాల్సిన ఈ ఎన్నికలను రాజకీయపార్టీలు పరోక్ష మద్దతుతో నడిపిస్తున్నాయి. స్థానికంగా ఎక్కడికక్కడ తమ బలాబలాల్ని రుజువుచేసుకొనేందుకు ప్రధాన రాజకీయపార్టీలన్నీ చివరి వరకు వ్యూహరచన చేస్తూనే ఉన్నాయి. సహజంగా పంచాయతీ ఎన్నికల్లో అధికారపార్టీ మద్దతు ఉన్న అభ్యర్థులే ఎక్కువగా విజయం సాధిస్తూ ఉంటారు. గడచిన పదేండ్లలో ఇదే జరిగింది. కానీ రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో అన్ని పార్టీలు క్షేత్రస్థాయిలో తమ పట్టును నిలుపుకొనేందుకు శాయశక్తులా కృషి -మిగతా 2 లో




## జనవరి 1న సామూహికంగా లొంగిపోతాం

- ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలుస్తాం
- అంతవరకు కగార్‌ను ఆపేయండి
- మావోయిస్టు ఎంఎంసీ ప్రతినిధి అనంత్ విజ్ఞప్తి
- మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సీఎంలకు లేఖ

న్యూఢిల్లీ

వచ్చే ఏడాది జనవరి 1న ఆయుధాలను వీడి ప్రభుత్వం ఎదుట సామూహికంగా లొంగిపోతామనీ, అప్పటి వరకు ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని మావోయిస్టు పార్టీ మధ్యప్రదేశ్-మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసీ) అధికార ప్రతినిధి అనంత్ ఆ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు అనంత్ లేఖను రాసినట్టు ఓ ప్రకటనను విడుదల చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మరోవైపు ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు జనజీవన స్రవంతిలో కలవాలని తమ కమిటీ నిర్ణయం తీసుకున్నదని ఆయన తెలిపారు. ఒక్కొరొక్కరుగా కాక సామూహికంగా ప్రభుత్వం ఎదుట లొంగిపోవటం ఉచితంగా ఉంటుందని తాము భావిస్తున్నట్టు వివరించారు. ఇప్పటికే పార్టీ అగ్రనేతలు సోనూ దాదా, సతీశ్ దాదాలు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశారనీ, వారు తీసుకున్న నిర్ణయం మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో అనివార్యంగా కూడా మారిందని అనంత్ పేర్కొన్నారు. సాయుధ బలగాల ఆపరేషన్‌లతో అనేక మంది పార్టీ శ్రేణులను కోల్పోవడం జరిగిందనీ, మిగతావారి మనుగడ కూడా ఆందోళనకరంగా ఉన్నదని వివరించారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఎదుట లొంగిపోవటం ఒకటే మార్గమని భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇదివరకు తాను రాసిన లేఖకు స్పందించి ఛత్తీస్‌గఢ్ హౌం శాఖ మంత్రి విజయ్ శర్మ 10-15 రోజుల పాటు లొంగిపోవడానికి వెసులుబాటు కల్పిస్తున్నట్టు ప్రకటించారనీ, కానీ అంత తక్కువ సమయం తమకు సరిపోదని అనంత్ వివరించారు. తమ శ్రేణులకు తాము తీసుకున్న తాజా నిర్ణయాన్ని తెలపడానికి సమయం -మిగతా 2 లో



## మూడు రోజులు చలి.. తర్వాత వానలు

- రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు
- దిత్వా తుఫాను ప్రభావంతోనే మార్పులు

హైదరాబాద్,

: నైరుతి బంగాళాఖాతంలో దిత్వా తుఫాను నెమ్మదిగా కదులుతున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాను ఆదివారం పుదుచ్చేరి తీరానికి చేరుకునే అవకాశమున్నదని అధికారులు అంచనా వేశారు. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత మళ్లీ పెరుగుతుందని చెప్పారు. ఈ నెల 30 వరకు ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో తీవ్రమైన చలి గాలులు వీచే అవకాశమున్నదని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తిరిగి 9 నుంచి 11 డిగ్రీ సెల్సియస్‌కు పడిపోయే అవకాశాలుంటాయని అంచనా వేశారుహైదరాబాద్‌లోనూ 3 రోజులపాటు రాత్రి ఉష్ణోగ్రతలు 11 నుంచి 14 డిగ్రీలుగా నమోదవుతాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు హెచ్చరించారు. తుఫాను కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశమున్నట్టు పేర్కొన్నారు. డిసెంబర్ 2 నుంచి 5 -మిగతా 2 లో

# సమాజసేవలో భాగంకండి

- విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి
- టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు
- టీపీసీసీ డాక్టర్స్ సెల్ జిల్లాల చైర్మెన్లకు నియామకపత్రాలు అందజేత


**హైదరాబాద్ నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

వైద్యులుగా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న డాక్టర్లు సమాజసేవలోనూ భాగం కావాలని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ డాక్టర్ సెల్ రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. రాష్ట్ర చైర్మెన్, ప్రధాన కార్యదర్శి, ఐదు జిల్లాల చైర్మెన్లు, ఇతర కీలక పదవులకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. -మిగతా 2 లో



# కాళేశ్వరం పూర్తికాకనే కామారెడ్డికి సాగునీటి కష్టాలు

- బీఆర్ఎస్ హయాంలోనే నిధులు కేటాయించలేదు
- సీఎంకు కొడంగల్‌పై ఉన్న ప్రేమ కామారెడ్డిపై లేదు
- తూతూ మంత్రంగానే వరద నష్టపరిహారం : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలుచేయాలని కామారెడ్డిలో రైల్‌రోకో



**కామారెడ్డి నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు 22వ ప్యాకేజీకి నిధులు కేటాయించలేకపోవడం వల్లనే పనులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని, దాంతో కామారెడ్డికి సాగునీరు అందడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డికి కొడంగల్‌పై ఉన్న ప్రేమ కామారెడ్డిపై లేదని ఆరోపించారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు హెూటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె -మిగతా 2 లో

# పంచాయతీ ఎన్నికలపై స్టే విధించలేం

## నోటిఫికేషన్ తర్వాత ఎందుకు సవాల్ చేస్తున్నారు


- ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక జోక్యం చేసుకోలేం
- కౌంటర్ దాఖలు చేయాలని సర్కార్‌కు ఆదేశం
- తదుపరి విచారణ 8 వారాలకు వాయిదా

**హైదరాబాద్ నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికలపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై ప్రభుత్వం జారీ చేసిన జీవో 46పై అభ్యంతరంపై వ్యక్తం చేస్తూ గురువారం వెనుకబడిన కుల సంఘాలు వేర్వేరుగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ మేరకు శుక్రవారం వారి పిటిషన్లపై చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణకు సర్కార్ విడుదల చేసిన జీవో నెం.46పై ఈ దశలో తాము స్టే ఇవ్వలేమని స్పష్టం చేశారు. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలనీ కోరుకుంటున్నారా? పిటీషనర్‌కు హైకోర్టు ప్రశ్న వేసింది. -మిగతా 2 లో



# చట్టసభల ఐదేండ్ల పదవీ కాలాన్ని మార్చొచ్చు!



- రాజ్యాంగం జడ పదార్థం కాదు
- పార్లమెంట్‌కు దాన్ని సవరించే అధికారం ఉంది
- రాష్ట్రాల ఆమోదం అక్కర్లేదు
- జమిలి బిల్లులపై లా కమిషన్

న్యూఢిల్లీ,

రాజ్యాంగ సవరణ ద్వారా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల ఐదేండ్ల పదవీ కాలాన్ని మార్చే రాజ్యాంగపరమైన హక్కు పార్లమెంట్‌కు ఉందని జమిలి ఎన్నికల బిల్లులపై అధ్యయనం చేస్తున్న సంయుక్త పార్లమెంటరీ సంఘానికి(జేపీసీ) 23వ లా కమిషన్ స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని 83, 172 అధికరణలలో పొందుపరిచిన ఐదేళ్ల పదవీకాలం స్థిరమైనది కాదని, విస్తృత జాతీయ ప్రయోజనాల కోసం దాన్ని మార్చవచ్చని తన సుదీర్ఘ వివరణలో జేపీసీకి లా కమిషన్ తెలియచేసింది. మన రాజ్యాంగ వ్యవస్థలో సాధారణ చట్టం ద్వారా లోక్‌సభ లేదా రాష్ట్ర అసెంబ్లీల పదవీ కాలాన్ని తగ్గించడం సాధ్యం కాదని, దీనికి కారణం 83, 172 అధికరణాలలో పదవీ కాలాన్ని నిర్దిష్టంగా పొందుపరచడం జరిగిందని లా కమిషన్ పేర్కొంది. -మిగతా 2 లో

# ఎత్తుకు పైఎత్తు

మొదటి తరువాయి




చేస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు అసెంబ్లీ, ఎంపీ, ఎమ్మెల్సీ, ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్. బీజేపీ పరస్పరం సహకరించుకున్నాయని అధికార కాంగ్రెస్‌పార్టీ ఆరోపణలు చేస్తూ వచ్చింది. కానీ ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్, బీజేపీలు వేర్వేరుగానే పోటీపడుతున్నాయి. తమ బలాబలాల్ని పెంచుకొనేందుకు తీవ్ర ప్రయత్నాలే చేస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఇప్పుడు గ్రామస్థాయిలో ఎన్నికయ్యే సర్పంచ్‌లే ప్రధాన పాత్ర పోషించాల్సి ఉంటుంది. అధికార కాంగ్రెస్‌పార్టీ మద్దతు కోసం క్షేత్రస్థాయిలో అభ్యర్థులు తమ స్థాయిల్లో అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకొనేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. కొత్తగా డీసీసీలుగా ఎన్నికైన నాయకులకు ఈ పంచాయితీ ఎన్నికలు సవాలుగా నిలుస్తున్నాయి. వారితో పాటు స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సహా అందరూ తమకు అనుకూలురైన అభ్యర్థులకు మద్దతు ఇచ్చి గెలిపించుకోవాలని తాపత్రయపడుతున్నారు. సీపీఐ(ఎం) బలపరిచే అభ్యర్థులు ఒంటరిగా పోటీచేసి, సత్తా చాటేందుకు ఉత్సాహంగా ఉన్నారు. సీపీఐ బలపరిచే అభ్యర్థులు కూడా ఒంటరిగానే పోటీ చేస్తున్నారు. అయితే ఈ రెండుపార్టీలు బలపరిచే అభ్యర్థులు ఒకే గ్రామంలో పోటీచేయరాదని రాజకీయ నిర్ణయం తీసుకున్నారు. దీనితో వామపక్షపార్టీలు బలపరిచే అభ్యర్థుల విజయావకాశాలు మెరుగుపడుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో అన్ని ప్రధాన పార్టీలు బీసీలకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నాయి. జనరల్ స్థానాల్లోనూ బీసీలను పెద్దసంఖ్యలో నిలపాలని భావిస్తున్నాయి. పార్టీలతో సంబంధం లేకున్నా, రాజకీయ పార్టీలే దగ్గరుండి ఈ ఎన్నికలను శాసిస్తుండటం గమనార్హం. అలాగే సాధ్యమైనన్ని గ్రామాలను ఏకగ్రీవాలు చేసేందుకు పార్టీలు శాయశక్తులా కృషి చేస్తున్నాయి. కొన్ని చోట్ల సర్పంచ్ పదవుల ఏకగ్రీవానికి వేలంపాటలు కూడా నిర్వహిస్తుస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. బీఆర్ఎస్ హయాంలోనూ పంచాయతీల ఏకగ్రీవాలకు తొలి ప్రాధాన్యత ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా అదే తరహాలో ఎత్తుగడలు వేస్తోంది. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) గ్రామీణంలో పోటీని ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. నామినేషన్ల దాఖలుకు శనివారం ఆఖరు రోజు. ఈ నేపథ్యంలో నామినేషన్లు పెద్దసంఖ్యలో దాఖలవుతాయని ఎస్ఈసీ భావిస్తున్నది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు ఇచ్చే ఫ్రీ సింబల్స్‌ను శుక్రవారం ఎస్ఈసీ విడుదల చేసింది. పోటీలో ఉండే అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని కూడా ఖరారు చేసింది. ఈ ఎన్నికల్లో 'నోటా' కూడా ఉంటుందని ఎస్ఈసీ తెలిపింది. సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఎన్నికల కోలాహలంతో గ్రామీణంలో సరికొత్త రాజకీయ ఉత్సాహం కనిపిస్తోంది.

# కాళేశ్వరం పూర్తికాకనే కామారెడ్డికి సాగునీటి కష్టాలు

మొదటి తరువాయి

మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే కామారెడ్డితో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు సైతం సాగునీరు అందుతుందని, కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళ్లేశ్వరం 22వ ప్యాకేజీకి రూ.1446 కోట్లు ప్రకటించి రూ.450 కోట్లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. దాంతో పనులు చేయలేక ఇప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టు అలాగే ఉందన్నారు. కామారెడ్డిలో వినాయక చవితి పండుగ రోజే వర్షాలు పడి అతలాకుతలమైతే ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తే వర్షాలు బందయిన తర్వాత వచ్చి పరామర్శించి తూతూ మంత్రంగా కుటుంబానికి రూ.11,000 నష్టపరిహారంలా ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. వర్షం వస్తే కామారెడ్డిలో ఇంత అపారనష్టం జరగడానికి కారణమేమిటని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో పెట్టిన హైడ్రా మాదిరే కామారెడ్డిలో పెడితే



మరోసారి వర్షం పడినా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగదన్నారు. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే ఉండి కేంద్రం నుంచి వరద బాధితులకు ఎలాంటి సహాయాన్ని అందించలేకపోయారన్నారు. ఇదే ప్రమాదం గుజరాత్‌లో జరిగితే లక్షల్లో నష్టపరిహారం ఇచ్చేవారని విమర్శించారు. కామారెడ్డి నాదని గొప్పలు చెప్పే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ అమలుపై శ్రద్ధ పెట్టడం లేదని అన్నారు. ఎన్నోసార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చిన సీఎం.. కేంద్ర ప్రభుత్వంతో ఒక్కసారి కూడా బీసీ డిక్లరేషన్‌పై మాట్లాడి వినతిపత్రం ఇచ్చిన దాఖలాల్లేవన్నారు. తాను ఇప్పటివరకు రాష్ట్రంలోని 11 జిల్లాల్లో పర్యటించానని.. ఆదిలాబాద్, జుక్కల్‌లో రోడ్లు రవాణాకు అనుకూలంగా లేవని అన్నారు. వాటిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నాయకులపై లేదా అని ప్రశ్నించారు. జుక్కల్ నియోజకవర్గంలో పత్తి పండించే రైతులు కోరిక మేరకు స్థానిక ఎమ్మెల్యే స్పందించి జిన్నింగ్ మిల్లు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. 2

# పంచాయతీ ఎన్నికలపై స్టే విధించలేం

మొదటి తరువాయి

నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదని ఎలక్షన్ కమిషన్ తరఫు అడ్వకేట్ తన వాదనలు వినిపించారు. 42 శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని మేమే చెప్పాం కదా? అంటూ హైకోర్టు వ్యాఖ్యానించింది. గతంలో 2009లో ఇదే తరహా పరిస్థితి వచ్చినప్పుడు జీహెచ్ఎంసీ ఎన్నికలను రద్దు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది గుర్తు చేశారు. ఈ దశలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చి చెప్పింది."మేమే ఎన్నికలు నిర్వహించమని ఆదేశించి.. మేమే స్టే ఎలా ఇస్తాం' అంటూ ప్రశ్నించింది. డెడికేటెడ్ కమిషన్ రిపోర్ట్‌ను బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది కోరగా.. ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు తెలిపింది. సబ్ క్యాటగిరి రిజర్వేషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. 6 వారాలోపు కౌంటర్ దాఖలు చేయాలన్న కోర్టు.. తదుపరి విచారణ 8 వారాలకు వాయిదా వేసింది.

**సొంత మొబైల్స్‌తో పోలీసుల చలాన్లు : హౌంశాఖకు హైకోర్టు నోటీసులు**

హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీసుల చలాన్ల పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. ట్రాఫిక్ పోలీసులు చలాన్లు వేసిన విధానంపై హైకోర్టు సీరియస్ అయింది. మొబైల్ ఫోన్లతో ఫొటోలు తీసి చలాన్ వేస్తున్నారని పిటిషనర్ రాఘవేంద్ర చారి పేర్కొన్నారు. పోలీసులు సొంత మొబైల్ ఫోన్ల ద్వారా తనకు మూడు చలాన్లు వేసినట్టు కోర్టుకు తెలిపారు. దీంతో రాష్ట్ర హౌంశాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ట్రాఫిక్ చలాన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానంపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ-చలానా వ్యవస్థలో ట్రాఫిక్ ఉల్లంఘనలను పేర్కొంటూ చలానా జారీ అయ్యే వ్యవస్థను అభివద్ధి చేయాల్సి ఉందనీ, ఆ మేరకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను డిసెంబరు 9వ తేదీకి వాయిదా వేసింది.

## జనవరి 1న సామూహికంగా
# లొంగిపోతాం

మొదటి తరువాయి



పడుతుందని ఆయన అన్నారు. ఈ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులలో తాము లొంగిపోవడానికి ఎవరైతే అనుకూలమైన రీతిలో చర్యలు తీసుకుంటారో వారి సమక్షంలోనే సామూహికంగా లొంగిపోవాలని తాము భావిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. లొంగిపోయే ముందు కానీ, లొంగిపోయిన తర్వాత కానీ తమ వైపు నుంచి ప్రజల సంక్షేమానికి సంబంధించి కొన్ని డిమాండ్లను కూడా ప్రభుత్వం ముందు ఉంచుతామని అనంత్ వివరించారు. లొంగిపోవాలని తాము తీసుకున్న నిర్ణయాన్ని ఆలిండియా రేడియో ద్వారా సాయంత్రం ప్రసారం చేసే ప్రాంతీయ వార్తల కంటే ముందు తమ ప్రకటనను కూడా ప్రసారం చేయాలనీ, దాని ద్వారా తమ పార్టీ శ్రేణులు సమాచారం అందుకోవడానికి వెసులుబాటుగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# సమాజసేవలో భాగంకండి

మొదటి తరువాయి



మిగిలిన రాష్ట్ర, జిల్లా కమిటీల్లో మిగిలిన నియామకాలను త్వరలో ప్రకటించనున్నట్టు తెలిపారు. విద్యావంతులు రాజకీయాల్లోకి వస్తే నాణ్యత పెరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్‌లోకి పెద్ద సంఖ్యలో డాక్టర్లు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వైద్యరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. మెరుగైన ప్రజారోగ్యం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఆయన తెలిపారు. వైద్యుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడానికి వైద్యులు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. టీపీసీసీ మెడికల్ అండ్ హెల్త్ విభాగం రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ రాజీవ్ మాట్లాడుతూ కమిటీల నియామకం ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసే దిశలో ఒక మంచి నిర్ణయమని తెలిపారు. వైద్యరంగంలో నిర్మాణాత్మక ఆలోచనలతో పని చేయడానికి అవకాశమిచ్చినందుకు మహేశ్ కుమార్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సలహాలు, సూచనలతో వైద్యరంగంలోని అన్ని విభాగాల సిబ్బంది సంక్షేమం కోసం త్వరలోనే ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. తనను ప్రోత్సహిస్తున్న వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.

# మూడు రోజులు చలి.. తర్వాత వానలు

మొదటి తరువాయి

వరకు రాష్ట్రంలోని దక్షిణ, తూర్పు జిల్లాలపై తుఫాను ప్రభావం ఉంటుందని అధికారులు చెప్పారు. ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నదని తెలిపారు. చలి, వర్షాల నేపథ్యంలో ప్రజలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

# చట్టసభల ఐదేండ్ల పదవీ కాలాన్ని మార్చొచ్చు!

మొదటి తరువాయి

అయితే ప్రజా సంక్షేమ విస్తృత ప్రయోజనాలను నెరవేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని మార్చవచ్చని కమిషన్ తెలిపింది. బిల్లులో కూడా ఇదే ప్రతిపాదన ఉందని కమిషన్ పేర్కొంది.

**రాజ్యాంగంలో ఆ సౌలభ్యం ఉంది**

చట్ట సభల నిర్వహణలో సౌలభ్యం కోసం రాజ్యాంగం ఆ అవకాశాన్ని కల్పించిందని, కాలపరిమితికి ముందుగానే రద్దు చేయడం, అత్యవసర పరిస్థితులలో కాలపరిమితిని పొడిగించడానికి రాజ్యాంగం అవకాశం కల్పిస్తున్నట్లు లా కమిషన్ వివరించింది. ఐదేళ్ల పదవీకాలాన్ని మార్చడానికి వీల్లేదన్న భావన సరికాదని పేర్కొంది. జమిలి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన వెనుక ఉద్దేశాలలో తక్కువ వ్యయంతో విస్తృత జాతీయ ప్రయోజనాలను సాధించడం ఒకటని లా కమిషన్ వివరించింది. ఒక దేశం, ఒక ఎన్నిక ప్రతిపాదన ప్రజాస్వామిక ప్రక్రియను బలహీనపరుస్తుందన్న వాదన సరైంది కాదని పేర్కొంది. ప్రతిపాదిత బిల్లు వల్ల ప్రజాస్వామ్యం బలపడుతుందని, తరచూ జరిగే ఎన్నికల భారాన్ని తగ్గించడంతోపాటు పరిపాలనపై ప్రభుత్వాలు మరింత దృష్టి పెట్టేందుకు అవకాశం కల్పిస్తుందని కమిషన్ వాదించింది. ఎన్నికలను సమన్వయపరచాలన్న ప్రతిపాదనతో ఓటర్ల ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ జరుగుతుందని స్పష్టం చేసింది. ప్రతిపాదిత బిల్లు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించబోదని కూడా తెలిపింది.

**రాష్ట్రాల ఆమోదం అక్కర్లేదు**

రాజ్యాంగ సవరణకు రాష్ట్రాల ఆమోదం అవసరం లేదని న్యాయ కమిషన్ తెలిపింది. రాజ్యాంగానికి చేయవలసిన సవరణలు సగం రాష్ట్రాల నుంచి ఆమోదం అవసరమన్న క్యాటగిరీల పరిధిలోకి రావని లా కమిషన్ స్పష్టం చేసింది. ప్రతిపాదిత సవరణ ఆర్టికల్ 368(2) నిబంధనల పరిధిలోకి వస్తుందని, దీనికి రాష్ట్రాల ఆమోదం అవసరం లేదని కమిషన్ తెలిపింది. జమిలి ఎన్నికల కారణంగా భారత ఎన్నికల కమిషన్(ఈసీఐ)కు మరిన్ని అధికారాలు ఇవ్వాల్సి వస్తుందన్న ఆందోళనలను కూడా లా కమిషన్ తోసిపుచ్చింది. జమిలి ఎన్నికల నిర్వహణ కోసం ఈసీఐకి ప్రతిపాదిత సవరణల్లో ఇవ్వ తలపెట్టిన అధికారాలు దాని అధికారాల విస్తరణగా పరిగణించాలంది.అయితే ప్రజా సంక్షేమ విస్తృత ప్రయోజనాలను నెరవేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా దీన్ని మార్చవచ్చని కమిషన్ తెలిపింది. బిల్లులో కూడా ఇదే ప్రతిపాదన ఉందని కమిషన్ పేర్కొంది.

# గ్రీన్ ఫీల్డ్ రోడ్ పై రైతుల ఆందోళన,వినతిపత్రం సమర్పణ




**ఆమనగల్లు, నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు మున్సిపాలిటీ మూడవ వార్డు సాకీబండ తండా రైతులు ప్రతిపాదిత గ్రీన్ ఫీల్డ్ రేడియల్ లైన్ రోడ్ (330 అడుగులు, ఫేజ్ -2) పై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామసభను బహిష్కరించిన వారు తమ డిమాండ్లను జాయింట్ కలెక్టర్ చంద్రకాంత్ రెడ్డి, తాసిల్దార్ అధికారులకు వినతిపత్ర రూపంలో సమర్పించారు.మీరాన్‌పేట నుండి ఆకుతోటపల్లి వరకు ప్రతిపాదిత రహదారి ఆమనగల్లు రెవెన్యూ శివారు సర్వే నంబర్లు 195, 196, 197, 198, 199, 205 -210, 281-283, 287-290లోని భూములను ప్రభావితం చేస్తోంది. ఈ భూములు ఎక్కువగా ST- లంబాడా మరియు ఇతర భూమిలేని పేద కుటుంబాలకు చెందిన స్వచ్ఛమైన పట్టా వ్యవసాయ భూములు. దాదాపు 60 -70 ఎకరాల సారవంతమైన భూమి ఈ ప్రాజెక్ట్ వల్ల నష్టపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.తరతరాలుగా సాగు చేస్తున్న ఈ భూములు రైతుల ఏకైక జీవనోపాధి. సంవత్సరానికి మూడు సీజన్ల పంటలతో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రస్తుత




అలైన్‌మెంట్ వందలాది కుటుంబాల మనుగడకు ముప్పు కలిగిస్తుందని రైతులు పేర్కొన్నారు.రైతులు ప్రతిపాదిత రహదారిని స్వల్పంగా మళ్లించి ప్రభుత్వ భూముల ద్వారా తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఆమనగల్లు శివారు సై.నెం. 186 -201లో 126.6 ఎకరాల ప్రభుత్వ భూమి, అలాగే ఆరుపల్లి శివారు (మద్గుల్ మండలం)లో 100 ఎకరాల ప్రభుత్వ భూమి, ఇతర సాగు కాని భూములు కలిపి మొత్తం 226 ఎకరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ మార్గం ద్వారా రహదారి మాలెపల్లి వద్ద ఆర్ఆర్ఆర్కి సులభంగా కనెక్ట్ అవుతుందని రైతులు సూచించారు.భూమి కోల్పోయే కుటుంబాలకు అదే ప్రాంతంలో ప్రత్యామ్నాయ భూమి కేటాయించాలని, సాధ్యం కాని సందర్భంలో ఎకరానికి కనీసం ?1.5 కోట్ల పరిహారం ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉపాధి అవకాశం కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. సమగ్ర పునరావాస ప్యాకేజీతో గిరిజన మరియు పేద కుటుంబాల ఆర్థిక స్థిరత్వం, సామాజిక రక్షణను నిర్ధారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాండు నాయక్, బోడియ్య నాయక్, మణిపాల్, పత్య నాయక్, బాలు నాయక్, రవి రాథోడ్, శివరాం, గోపి, లాల్సి సింగ్, నారియా నాయక్, దుద్యి వినాయక్, కిమ్యా నాయక్, దేశీయ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీశ్రేణులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం



**మానకొండూర్, నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంచాయతీ ఎన్నికల్లో గెలుపే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలో జరిగిన పార్టీ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పాల్గొని, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రచార కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధానంపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమని పేర్కొన్నారు. పట్టింపులకు పోకుండా పంచాయతీల్లో పట్టు సాధించడంపైనే దృష్టి సారించాలని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు.అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల గురించి ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి, పార్టీ బలాన్ని పెంచేలా పనిచేయాలని ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, తిమ్మాపూర్, గన్నేరవరం మండల అధ్యక్షులు బండారి రమేశ్, ముస్కు ఉపేందర్ రెడ్డి, అలాగే మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, శ్రీగిరి రంగారావు, గోపు మల్లారెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, మామిడి అనిల్ కుమార్, ఎస్.కొండల్ రావు, కొత్త తిరుపతిరెడ్డి, గోగూరి నర్సింహారెడ్డి, పోలు రాము, మాతంగి అనిల్, బొద్దు సునిల్, రవీందర్ రావు, శ్రీధర్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, నాగిశెట్టి రాజయ్య, దూలం వీరస్వామి గౌడ్, ఒడ్నాల నర్సయ్య, కె.రాంప్రసాద్, బుర్ర శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి జెడ్పీ హైస్కూల్‌లో కనపర్తి రమేష్ ఉద్యోగ విరమణ సభ



**కరీంనగర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్తపల్లిలో ఆంగ్ల ఉపాధ్యాయుడు కనపర్తి రమేష్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా విద్యాధికారి శ్రీరామ్ మొండయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకులు, వారి క్రమశిక్షణ, అంకితభావం పిల్లల జీవితాలను ప్రభావితం చేస్తాయని అన్నారు. రమేష్ అనేకమందిని ఆంగ్లంలో నిష్ణాతులుగా తీర్చిదిద్దారని, వారి చేతిరాతతో విద్యార్థులను మంత్రముగ్ధులను చేశారని గుర్తు చేశారు. పదవి విరమణ తర్వాత కూడా అవసరమైనప్పుడు సేవలు అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ మిల్కురి శ్రీనివాస్, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ జయపాల్ రెడ్డి, డిసిబి చైర్మన్ భగవంతయ్య, మండల విద్యాధికారి తుమ్మ ఆనందం, ప్రధానోపాధ్యాయుడు కన్నం రమేష్, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు సువర్ణ, శ్రేయోభిలాషులు భోగ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా చైతన్యంతోనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ




**కరీంనగర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి అధ్యక్షతన జరిగింది. సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాల వల్ల విద్యారంగం క్షీణిస్తోందని, ప్రజా చైతన్యం, ఉపాధ్యాయుల అంకితభావం ద్వారానే ప్రభుత్వ పాఠశాలలు నిలబడతాయని హెచ్చరించారు. శాతవాహన యూనివర్సిటీ ప్రిన్సిపల్ సుజాత ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు, ఉపాధ్యాయుల కొరతపై ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని డిమాండ్ చేశారు. రఘుశంకర్ రెడ్డి ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయ సంఘాలపై ఉందని పేర్కొన్నారు. వై. అశోక్ ఉపాధ్యాయులను విద్యేతర పనులకు దూరంగా ఉంచాలని, కే. రవిచంద్ర విద్యా రంగానికి కనీసం 15% బడ్జెట్ కేటాయించాలని కోరారు. ఆవాల నరహరి ప్రభుత్వాలు అశాస్త్రీయ విధానాలను ప్రవేశపెడుతున్నాయని, ప్రజా ఉద్యమాల ద్వారా శాస్త్రీయ విద్యావిధానాలకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కమిటీ ఎన్నికలు జరిగి ఆవాల నరహరి జిల్లా అధ్యక్షుడిగా, సుజాత అధ్యక్షురాలిగా, బాలయ్య ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

# మహాత్మానగర్‌లో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్

### ప్రజల సమస్యలపై ఆరా



**తిమ్మాపూర్, నవంబర్ 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో శుక్రవారం ఉదయం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు వార్డుల్లో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. వార్డుల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రధానంగా వీధి కుక్కల సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు వివరించగా, ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, వీధి కుక్కల సమస్యను నియంత్రించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమస్య పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.తరువాత ఆయన మిషన్ భగీరథ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశమయ్యారు. వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆరా తీశారు. ఈ సందర్భంగా కొంతమంది ఆపరేటర్లు తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావించి, అందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## తూకం లోపాల పై రైతుల ఆందోళన



**మానకొండూర్, నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానకొండూర్ మండల కేంద్రంలోని రైతువేదిక ముందు, కరీంనగర్ - వరంగల్ ప్రధాన రహదారి పై ఈరోజు ఉదయం 11 గంటలకు రైతులు ఆందోళన చేపట్టారు. ఐకేపీ అధికారులు ఒక బస్తాకు 40 కిలోల తూకం వేయవలసి ఉండగా, నిర్వాహకులు 43 కిలోలు తూకం వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తూకం లోపం కారణంగా తమకు నష్టం జరుగుతోందని వారు తీవ్రంగా అభ్యంతరం తెలిపారు.రైతులు ఐకేపీ నిర్వాహకులను ప్రశ్నించగా, "మీరు ఎవరికైనా చెప్పుకోండి" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని వారు ఆరోపించారు. ఈ వ్యవహారంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.స్థలానికి చేరుకున్న మానకొండూర్ సీఐ సంజీవ్ రైతులతో మాట్లాడి, వారికి తప్పక న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన హామీతో రైతులు ఆందోళనను విరమించారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలు

### దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.




**దేవరకొండ నవంబర్ 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం లో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు .ఈసందర్భంగా అధ్యక్షుడు ఎన్ వి టి సభ్యులతో కలిసి పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించినారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతి రావ్ పూలే ఒక సామాజిక సంస్కర్త, విద్యావేత్త మరియు కుల వ్యతిరేక కార్యకర్త. ఈయన మహిళా విద్య కోసం, సామాజిక సమానత్వం కోసం కృషి చేశారు అని మరియు సత్యశోధక్ సమాజాన్ని స్థాపించారు. జ్యోతిరావు పూలే మహారాష్ట్రకు చెందిన సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త మరియు రచయిత. సమాజంలో కుల వివక్షను, లింగఅసమానతలను రూపుమాపాలని ఆయన ఆకాంక్షించారు. సమాజంలో సమానత్వం, ప్రేమ, గౌరవం ఉండాలని నమ్మి, ఆయన సత్యశోధక్ సమాజ్ అనే సంస్థను స్థాపించారు. మహిళల విద్యను ప్రోత్సహించడం, పేదలు మరియు అంటరానివారి జీవితాలను మెరుగుపరచడం వంటి అంశాలపై కృషి చేశారు. అని సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, తాళ్ల సురేష్, భాస్కర్ రెడ్డి, శ్రీనయ్య, వలమల్ల ఆంజనేయులు, వంగూరు వెంకటేశ్వర్లు, ఆదర్శ్, చరణ్, రమేష్, ఆనంద్, శివకుమార్, షేక్ శంశోదీన్, భరత్, రాంబాబు, బారిములు, రాజకుమార్, చక్రపాణి, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



**జీడిమెట్ల, నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటానని, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పెండింగ్‌లో ఉన్న అంశాలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దొమ్మర పోచంపల్లి పరిధిలో ఇప్పటికే దీనికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైందని, సంబంధిత శాఖ మంత్రితో కూడా చర్చించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.సూరారం ప్రాంతంలో నిర్మించబడుతున్న ప్రెస్ క్లబ్ భవనాన్ని పూర్తి చేయించే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇప్పటికే కొంత శాతం నిర్మాణం పూర్తయిందని, మరో 10 లక్షల రూపాయలతో వచ్చే నెల మొదటి వారంలో పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. అవసరమైతే మరో 20 లక్షలు సొంతంగా ఇచ్చి భవనాన్ని పూర్తి చేస్తానని, ఆ భవనాన్ని తన తండ్రి పేరు మీద కూన మాణిక్యం పాండు జర్నలిస్ట్ భవన్ గా జర్నలిస్టులకు అందజేస్తానని తెలిపారు.అదనంగా, స్థానిక కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో మాట్లాడి జర్నలిస్టులకు వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యుజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతి సాగర్, టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు తన్నీరు శ్రీనివాస్, టీఎస్యూజె నాయకులు గుంటూరు శేఖర్, కసుకుర్తి వెంకట్, టియుడబ్ల్యుజె నాయకులు రంగు వెంకటేష్ గౌడ్, కొలిపాక వెంకట్, ఉద్దండపురం వెంకటేష్ గౌడ్, శివాజీ, కుంట అనిల్ కుమార్, ఫెడరేషన్ నాయకులు దామెర జగదీశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# దీక్షా దివాస్ కార్యక్రమాన్నీ విజయవంతం చేయాలి

**- కేసీఆర్‌సంకల్ప బలానికి, దీక్షాదక్షతకు సాక్ష్యం దీక్షా - దివస్.**
**-బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ .**



**దేవరకొండ,నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నేడు నల్గొండ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్న దీక్షా దివాస్ కార్యక్రమాన్నీ విజయవంతం చేయాలి బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పిలుపు నిచ్చారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ,దీక్షా దివాస్ సందర్భంగా కెసిఆర్ చేసిన ఉద్యమ పోరాటం, గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు.తెలంగాణ వచ్చుడో కేసీఆర్ సచ్చుడో అన్న తెగువతో నాలుగు కోట్ల మందిని ఏకం చేసి, కాశ్మీర్ నుండి కన్యా కుమారి వరకు అన్ని రాజకీయ వ్యవస్థలను ఒప్పించి మెప్పించి కుల మతాలకు అతీతంగా ఏకం చేసిన దీక్షా దివాస్ ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు.కేసీఆర్ సంకల్ప బలానికి, దీక్షాదక్షతకు సాక్ష్యం దీక్షా - దివస్ అని ఆయన అన్నారు.అరవై ఏండ్ల గాయాలు, వేదనలను తెలంగాణ కన్నీళ్లను తీర్చిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ అని ఆయన తెలిపారు.గాలి, నీరు, నేల ఉన్నంత కాలం తెలంగాణలో కేసీఆర్ అనే మూడక్షరాలు పదిలం అని ఆయన అన్నారు.

# జ్యోతిబా పూలే వర్థంతి సందర్భంగా ఎమ్మెల్యే నివాళులు



**ఎలిగేడు, నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని తన నివాసం వద్ద శుక్రవారం రోజున జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా పెద్దపల్లి ఎమ్మెల్యే శ్రీ చింతకుంట విజయరమణ రావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్మరించారు. ఆయన ఆలోచనలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొని పూలే సేవలను స్మరించారు.

# తూడుకుర్తి లో ఖో ఖో చందనకు ఘన సన్మానం



**నాగర్ కర్నూల్,నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తూడుకుర్తి గ్రామానికి చెందిన విద్యార్థిని మధుగని చందన రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించింది. యాదాద్రి భువనగిరి జిల్లా పతంగి లో ఈ నెల 23, 24, 25 తేదీల్లో జరిగిన 69వ ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి ఖో ఖో 17 సంవత్సరాల బాలికల విభాగంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన చందన, రెండో స్థానం సాధించి గ్రామానికి గౌరవం తీసుకువచ్చింది.ఈ విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం పీఎం జెడ్ పి హెచ్ ఎస్ తూడుకుర్తి పాఠశాలలో ఉపాధ్యాయుల బృందం ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించింది. ఈనెల 17న జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టుకు ఎంపికైన చందన ప్రస్తుతం 10వ తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతోంది.సన్మాన కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు మొల్ల సత్యనారాయణ, అంజయ్య యాదవ్, కృష్ణమోహన్, గోపాల చారి, విమలదేవి, సఫియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సామ రమేష్ మాట్లాడుతూ చందన సాధించిన విజయంతో పాఠశాల గర్వపడుతోందని, ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఫ్యాబ్రికేషన్ కార్మికులకు రావలసిన వేతనం ఇప్పించిన కార్మిక నాయకుడు రవి



**కుత్బుల్లాపూర్, నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లిలోని ఒక ఫ్యాబ్రికేషన్ వర్క్ షాప్‌లో పనిచేస్తున్న రాహుల్, మంతోష్ అనే కార్మికులు జూన్ నెల వేతనం పొందక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్క్ షాప్ ఓనర్ కిషోర్ ఇవ్వాల్సిన 50,000 రూపాయల వేతనం పలుమార్లు అడిగినా నిర్లక్ష్యం వహించడంతో కార్మికులు విసుగుచెంది పనిని మానేశారు.తమకు జరిగిన అన్యాయం గురించి బిఆర్‌టియు రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిని సంప్రదించిన కార్మికులు సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన రవి, కాంట్రాక్టర్ కిషోర్‌ను కలసి పలుమార్లు చర్చించి, చివరికి రాహుల్, మంతోష్‌కు రావలసిన మొత్తం ?50,000 వేతనం ఇప్పించారు.తమకు న్యాయం జరిగిందని కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తూ రవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పిడిఎస్యు ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

**-- విద్యార్థుల్లో ఉత్సాహం**




**కల్వకుర్తి,నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కల్వకుర్తి పిడిఎస్యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, సృజనాత్మకతను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా వెల్దండ గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ గోపాల్ రావు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. అతిథులుగా సిపిఐ పార్టీ కల్వకుర్తి కార్యదర్శి పరశురామ్, కల్వకుర్తి జేఏసీ చైర్మన్ సదానందం గౌడ్, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి అధ్యక్షుడు రాజేందర్ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో దీపికా కృష్ణవేణి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు నవీన్ కుమార్, పిడిఎస్యు స్పోర్ట్స్ ఇంచార్జ్ మల్లేష్, పీఈటీలు రవీందర్, రమేష్, మహేష్, శీను, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ తోనే సమాజాభివృద్ధివిద్యార్థులు పరిశోధనా స్ఫూర్తి పెంచుకోవాలి

## కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి,నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రోజురోజుకు సాంకేతికపరంగా అనేక మార్పులు జరుగుతున్న నేపథ్యంలో, వాటికి అనుగుణంగా విద్యార్థులు సైన్స్‌ను అందిపుచ్చుకుని కొత్త ఆలోచనలకు పదును పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం వనపర్తి మండలం చిట్యాలలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న 53వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన - 2025-26 మరియు ఇన్‌స్పైర్ అవార్డ్స్ -2024-25 కార్యక్రమాలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల్లో లాజికల్ థింకింగ్ పెంపుదల కోసం జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో సైన్స్ ఉపాధ్యాయులు సిద్ధం చేసిన పుస్తకాన్ని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించారు.
మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ ప్రదర్శనకు జిల్లాలోని 150 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటున్నారు. మొత్తం 270 వైజ్ఞానిక నమూనాలు (ఎగ్జిబిట్స్) ప్రదర్శనలో విన్యసించనున్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విద్యార్థులు చిన్ననాటి నుంచే కొత్త ఆలోచనలపై దృష్టి సారించాలని సూచించారు. "సైన్స్ అంటేనే నిజం. ప్రకృతిలో దాగి ఉన్న అనేక నిజాలను సైన్స్ ద్వారా తెలుసుకోవచ్చు. సైన్స్‌ను అలవడించుకుంటే జీవితంలో ముందుకు సాగవచ్చు. నేడు ఇక్కడి నుంచే ఇతర గ్రహాలపై ఉన్న డ్రోన్లను ఆపరేట్ చేసే స్థాయికి సాంకేతికత ఎదిగింది," అని అన్నారు. పరిశోధనాత్మక దృక్పథంతో ప్రతి విషయాన్ని అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలోని సమస్యల పరిష్కారానికి సృజనాత్మక ఆలోచనలతో కూడిన సైన్స్ మార్గం చూపుతుందని, సాంకేతికత అభివృద్ధి చెందుతున్న ఈ యుగంలో కొత్త ఆవిష్కరణలు ప్రతి రంగాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయని కలెక్టర్ అన్నారు. ప్రపంచం ఆధునిక సాంకేతికత వైపు వేగంగా పరిగెడుతున్న నేపథ్యంలో, విద్యార్థులు ప్రతి శాస్త్రీయ అంశాన్ని లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు.తదుపరి, విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్స్‌ను పరిశీలించిన కలెక్టర్, వాటిపై విద్యార్థులతో ప్రశ్నోత్తరాలు జరిపారు. విద్యాశాఖ అభివృద్ధి కోసం కలెక్టర్ చేస్తున్నారు కృషిని గుర్తించిన అధికారులు ఆయనను శాలువాతో సత్కరించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, తహసిల్దార్ రమేష్ రెడ్డి, జి.సి.డి.ఓ. శుభలక్ష్మి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే


**వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి**



**వనపర్తి,నవంబర్ 28( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తన భార్య సావిత్రిభాయ్ పూలేతో కలిసి బాలికల కోసం దేశంలో మొదటి పాఠశాలను స్థాపించి మహిళలకు విద్యాబోధన చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలేని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు.పూలే వర్ధంతి సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్షతను తొలగించి సామాజిక సమానత్వం కోసం ఉద్యమించిన సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త సంఘ సంస్కర్త పూలే అన్నారు.దళిత వర్గాల అభివృద్ధి,సాధికారత కోసం ముందుకు తీసుకువచ్చి మహిళలకు కూడా విద్య అందించాల్సిన అవసరాన్ని ఉందని తన సతీమణి సావిత్రి భాయ్ గారి తో విద్యాభ్యాసం చేయించిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి కృష్ణ, పట్టణ మాజీ కౌన్సిలర్లు చీర్ల సత్యం, వెంకటేష్, మధుగౌడ్, యాదగిరి, శరవంద, విభూది నారాయణ, వినోద్ గౌడ్, బొంబాయి మన్నెకొండ, పరుశురాం, నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ ఎస్టి, ఎస్సి, బిసి, మైనార్టీ నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# తొలి విడత పంచాయతీ ఎన్నికలకు 1100 మంది సిబ్బంది

**-సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం**
**-డీపీఓ పల్లా రఘునాథ్ రెడ్డి**



**వనపర్తి నవంబర్ 28( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
వనపర్తి జిల్లాలో 268 పంచాయతీలు ఉన్నాయని, మొదటి విడత 87 పంచాయతీలకు ఎన్నికలకు 1100 సిబ్బంది సిద్ధంగా ఉన్నారని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఎన్నికలు నిర్వహిస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆంధ్రప్రభ విద్యా విభాగంతో ఆయన మాట్లాడుతూ తొలివిడత ఎన్నికలకు 1100 మంది సిబ్బందిని కేటాయించామన్నారు. మొదటి విడతకు గురువారం నామినేషన్ల ప్రక్రియ మొదలైందని, 42 పంచాయితీల నుంచి నామినేషన్లు వచ్చాయన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎన్నికలు సవ్యంగా జరిగేందుకు కలెక్టర్ ఆదేశానుసారం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని డిపిఓ రఘునాథ్ రెడ్డి అన్నారు.

# ఇముల నర్వ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా ఆగిరి మమత రవికుమార్ గుప్తా



**కొత్తూరు, నవంబర్ 28(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తూరు మండలంలోని సిద్దాపూర్ బూత్‌లో ఇముల నర్వ గ్రామానికి కాంగ్రెస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా ఆగిరి మమత రవికుమార్ గుప్తా నామినేషన్ వేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం లక్ష్యంగా తన అభ్యర్థిత్వాన్ని సమర్పించిన మమత రవికుమార్ గుప్తా, స్థానిక నాయకులు, కార్యకర్తల సమక్షంలో నామినేషన్ ప్రక్రియను పూర్తి చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆమెకు మద్దతు ప్రకటిస్తూ, గ్రామ ప్రజలతో కలసి అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తారని తెలిపారు.

# మహబూబాబాద్‌ను బాల్యవివాహాల రహిత జిల్లాగా మార్చాలని సంకల్పం




**మహబూబాబాద్, నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ జిల్లాను ఒకే ఏడాదిలో బాల్యవివాహాల రహిత జిల్లాగా మార్చాలని సొసైటీ ఫర్ హెల్త్ అవేర్‌నెస్ అండ్ రూరల్ ఎన్లైటెన్‌మెంట్ (షేర్ ఎన్ జి ఓ) సంకల్పించింది. భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా బాల్యవివాహాలను నిర్మూలించేందుకు ప్రారంభించిన 100 డేస్ ఇంటెన్సివ్ యాక్షన్ ప్లాన్కు ప్రేరణగా ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది.దేశవ్యాప్తంగా ‘బాల వివాహ ముక్త్ భారత్’ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా షేర్ ఎన్ జి ఓ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. పాఠశాలలు, ఆధ్యాత్మిక స్థలాలు, వివాహ సేవలందించే వర్గాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో లక్ష్యబద్ధంగా అవగాహన పెంచే ప్రయత్నం జరుగుతోంది.దేశవ్యాప్తంగా 451 జిల్లాల్లో పనిచేస్తున్న జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రెన్ నెట్‌వర్క్‌లో భాగమైన షేర్ ఎన్ జి ఓ గత ఏడాది ఒక లక్షకు పైగా బాల్యవివాహాలను అడ్డుకుంది. మహబూబాబాద్ జిల్లాలో గత ఏడాదిలోనే 300 కుటుంబాల నుండి బాల్యవివాహాలు జరపబోమని అండర్‌టేకింగ్స్ పొందింది. పెళ్లి కేటరర్లు, పూజారులు, అతిథులు, స్టేజ్ డెకరేటర్లు వంటి సేవలందించే వారందరికీ బాల్యవివాహాల్లో పాల్గొంటే శిక్షార్హులని చట్టపరమైన అవగాహన కల్పించింది.ఈ సందర్భంగా షేర్ ఎన్ జి ఓ డైరెక్టర్ జి. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, “ఈ 100 రోజుల ఇంటెన్సివ్ చర్యలు దేశ భవిష్యత్తును మార్చే శక్తి కలిగివున్నాయి. ఎన్నికైన ప్రతినిధులు, ప్రభుత్వ శాఖలు, పోలీసు శాఖలు, కమ్యూనిటీలుకలిసి పనిచేయడం భారతదేశం బాల్యవివాహాలను నిర్మూలించాలన్న సంకల్పానికి కొత్త దిశ చూపుతోంది. వచ్చే ఏడాదిలో మా జిల్లా తప్పకుండా బాల్యవివాహాల రహిత జిల్లాగా మారుతుందని మేము నమ్ముతున్నాం” అని అన్నారు.మహర్షి పాఠశాలలో శుక్రవారం బాల్యవివాహాల రహిత జిల్లా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు బాల్యవివాహాల దుష్పరిణామాలు వివరించి, అలాంటి ఘటనలు కనిపించిన వెంటనే 1098 లేదా స్థానిక అధికారులకు తెలియజేయాలని సూచించారు.ఈ ప్రచార కార్యక్రమం మూడు విడతలుగా కొనసాగి, మార్చి 8, 2026 అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాటికి ముగియనుంది.

# టిఎస్ యుటి ఎఫ్ మండల అధ్యక్షుడిగా జంగయ్య




**కద్తాల్, నవంబర్ 28 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
టిఎస్ యుటిఎఫ్ కద్తాల్ మండల నూతన కమిటీ ఎన్నిక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల అధ్యక్షుడుగా జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ ను ఎన్నుకున్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో మండల మహాసభలో నూతన అధ్యక్షులుగా జంగయ్య మండల ప్రధాన కార్యదర్శిగా కృష్ణ,కోశాధికారిగా నరసింహమూర్తి ఎంపికయ్యారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు గోపాల్ నాయక్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బకాయిలు డిఏలు నూతన పిఆర్సిని సాధిస్తామని, అదేవిధంగా ఈ సంవత్సరం చివరి నాటికి హెల్త్ కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు మండల అధ్యక్షులు జంగయ్య మాట్లాడుతూ మండలంలో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా ప్రయత్నిస్తామని అదేవిధంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో కృషి చేస్తామని తెలిపారు. తదనంతరం నూతన కమిటీ చే మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. మండల ఉపాధ్యక్షులుగా మల్లయ్య కౌసల్య ఎఫ్ డబ్ల్యూ కన్వీనర్ గా సత్యనారాయణ మహిళ కన్వీనర్ గా కౌసల్య కార్యదర్శులు భీముడు విజయ్ కుమార్ సరోజిని శ్రీనివాస్ గౌడ్ దివ్య లు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నిర్మల,జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్,జిల్లా నాయకులు రఘు పాల్, రవీందర్ రెడ్డి,తిరుపతయ్య, పాల్గొన్నారు.

# సామాజిక తాత్విక ఉద్యమకారుడు జ్యోతిబా పూలేకు ఘన నివాళి






**మహబూబాబాద్, నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహబూబాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం సామాజిక తాత్విక మూలపురుషుడు మహనీయుడు జ్యోతిబా పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూలే గారి సేవలను స్మరించారు.సమాజంలోని అసమానతలను ప్రశ్నించి, విద్య అనే ఆయుధాన్ని ప్రజలకు అందించిన మహనీయుడు జ్యోతిబా పూలే అని, ఆయన మరణించి 137 సంవత్సరాలు గడిచినా ఆయన ఆశయాలు ఇంకా సజీవంగా కొనసాగుతున్నాయని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. సహచరి సావిత్రిబాయితో కలిసి అనేక మహిళా పాఠశాలలను ఏర్పాటు చేసి, మహిళలకు విద్య అవసరాన్ని తెలియజేసి, స్త్రీ–పురుష సమానత్వం సాధనలో, సతి అనే దురాచారాన్ని రూపుమాపడంలో ఆయన చేసిన కృషి విశేషమని పేర్కొన్నారు.ఈరోజు బాలికలు చదువుకుంటున్న స్థితి పూలే దంపతుల కృషి ఫలితమని, వారి ఆశయాలను కొనసాగిస్తూ ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో కళాశాల సిబ్బంది భాగ్యలక్ష్మి, శ్రవణ్ కుమార్, లక్ష్మి, బుడమ రవి, పూర్ణిమ, సత్యనారాయణ, కళావతి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా మరింత ముందుకు

**-కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచనలు**



**నల్గొండ, నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించి ఆర్థికంగా మరింత ముందుకు ఎదగాలని సూచించారు.శుక్రవారం నల్గొండ జిల్లా నుండి సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరుగుతున్న భారతీయ కళా మహోత్సవ్కు వెళుతున్న మహిళా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శుల ప్రత్యేక బస్సును కలెక్టర్ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళా మహోత్సవ్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి తయారైన పలు రకాల ఉత్పత్తులు ప్రదర్శించబడతాయని, వాటిని సందర్శించడం ద్వారా మహిళా సంఘాల సభ్యులకు విభిన్న ఉత్పత్తుల తయారీపై అవగాహన కలుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలు పొదుపు, ఆర్థిక అంశాలతో పాటు సామాజిక అంశాల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అలాగే వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లు తెలుసుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం అని అన్నారు. జిల్లాలోని మహిళా సంఘాలు కొత్త ఆలోచనలతో నూతన ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా మరింత ఆర్థికంగా ఎదగగలవని కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# కన్నుల పండుగగా అయ్యప్ప స్వామి అభిషేకం, మహా పడిపూజ



**నల్లగొండ,నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ పట్టణం ఎస్ఎల్ఎన్ కాలనీ లోని వెన్నెల సారీస్ జువెలరీస్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి వారికి మహా అభిషేకం,మహా పడిపూజ అత్యంత వైభవంగా, కన్నుల పండుగగా జరిగాయి. స్వామివారికి సమర్పించిన పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపు, గంధం, వివిధ రకాల పండ్ల రసాలతో అయ్యప్ప స్వామివారి మూలవిరాట్టుకు శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. అభిషేకం జరుగుతున్నంత సేపు భక్తులు “స్వామియే శరణం అయ్యప్ప” అంటూ భక్తి పారవశ్యంతో భజనలు చేశారు. భక్తులలో ఆధ్యాత్మిక అనుభూతిని నింపింది. ప్రత్యేకంగా అలంకరించిన 18 పవిత్ర మెట్లకు (పడి) మహా పడిపూజ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ పూజా కార్యక్రమాన్ని మేడం విశ్వ ప్రసాద్ గురు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అయ్యప్ప స్వామి దీక్ష తీసుకున్న మాలధారులు, భక్తులుఈ పడిపూజలో ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు. రంగురంగుల పుష్పాలు, దీపాలతో అలంకరించబడిన పడిని చూడటం భక్తులకు కన్నుల పండుగగా అనిపించింది. నిర్వాహకులు చొక్కారపు వెంకటేశ్వర్లు, మాధవి,సాయి నిఖిల్, వెన్నెల, లక్షమమ్మ, స్వామివారి సేవలో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. అనంతరం భక్తులందరికీ మహా ప్రసాద వి జరిగింది. ఈ కార్యక్రమంలోవినోద్, ప్రీతీ, నిర్మల, దేవేందర్,పుష్ప, ఆంజనేయులు, సముద్రాల కుమార్, రాములమ్మ, శ్రీధర్, పద్మ, ప్రభ, వేణు,భాను, సురేష్, మమత, కవిత, భవాని, సరిత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# డిపో అభివృద్ధికి ఆర్టీసీ సిబ్బంది కృషి చేయాలి



**మహబూబాబాద్, నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను మహబూబాబాద్ ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలోని పలు విభాగాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. అత్యధిక కేఎంపిఎల్ సాధించిన ఉద్యోగులను శాలువాతో సన్మానించారు.ఆయన మాట్లాడుతూ చలికాలంలో వాహనాలను నడిపేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. ఉత్తమ కేఎంపిఎల్ సాధించేందుకు ప్రతి డ్రైవర్ కృషి చేయాలని, అలాగే హైయెస్ట్ ఈపికే సాధించేందుకు కండక్టర్లు కూడా తమ వంతు పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డిపో మేనేజర్ వి. కళ్యాణి, ఆర్ఎం ఆఫీస్ సీఐ జనరల్ సరస్వతి, డిపో సూపరింటెండెంట్ పి. శ్రీమన్నారాయణ, ఎం.ఎఫ్. పాపిరెడ్డి, డిపో సూపర్వైజర్లు, ఆఫీస్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కోతులకుంట తాండలో బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



**వనపర్తి,నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఘనపురం మండలం కోతులకుంట తాండకు చెందిన మాజీ ఉపసర్పంచ్ పాండు నాయక్, ఆయన సతీమణి చంద్రమ్మ తదితరులు సహా మొత్తం 50 మంది కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, తాండా అభివృద్ధి కోసం తమతో చేరిన ప్రజలకు అండగా ఉంటానని పేర్కొన్నారు. పాండు నాయక్ మాట్లాడుతూ, తాండా అభివృద్ధికి నిరంజన్ రెడ్డి నాయకత్వమే కావాలనే నమ్మకంతో బీఆర్ఎస్‌లో చేరుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్ జాత్రు నాయక్, జోహెబ్ హుస్సేన్, సునీల్ వాల్మీకి, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు



**వెల్దండ,నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు మరియు స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి పథంలో చేస్తున్న కృషి తమను ఆకర్షించిందని నాయకులు తెలిపారు.బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరినవారిలో రంగరాతి శ్రీను, రంగరాతి శేఖర్, సింగరాజు మస్తాన్, పుట్ట శ్రీకాంత్ (టి టైమ్) ఉన్నారు. వీరిని కాంగ్రెస్ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ కుమార్ యాదవ్, వెల్దండ సింగిల్ విండో డైరెక్టర్ మట్టం వెంకటయ్య గౌడ్, వెల్దండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్ర శీను, నాగర్‌కర్నూల్ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు కొయ్యల పుల్లయ్య, వెల్దండ మండల యూత్ అధ్యక్షుడు మొట్ట భరత్, ఎండి రషీద్, పురుషోత్తం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**చిగురుమామిడి, నవంబర్ 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. సమాజంలోని అణగారిన వర్గాల కోసం నిస్వార్థ సేవను జీవన ధర్మంగా తీసుకుని, సమానత్వం–విద్య –న్యాయం అనే త్రివిధ దీపాలను వెలిగించిన మహోన్నత సమాజ సంస్కర్త జ్యోతిబా పూలే సేవలను ఈ సందర్భంగా స్మరించారు.పూలే సమాజంలోని అసమానతలను ప్రశ్నించి, విద్య అనే ఆయుధాన్ని ప్రజలకు అందించిన మేధావి. వివక్షలతో నిండిన సమాజంలో వెలుగు నింపిన విద్యోద్యమకారుడు. స్త్రీలకు విద్య అందించిన తొలి యోధుడు. కులతాత్విక అన్యాయాలకు ఎదురు నిలిచిన ధైర్యస్వరూపం. మానవత్వాన్ని అత్యున్నతంగా పరిగణించిన సేవాభావం. ఆయన ఆలోచనలు కేవలం మాటలు కాక, ప్రతి మనిషి గౌరవంగా బ్రతికే సమాజం కోసం చేసిన అపార సేవా యజ్ఞమని ఉపాధ్యాయులు, నాయకులు వివరించారు.ఈ వర్ధంతి సందర్భంగా ఆయన చూపిన మానవతా మార్గంలో నడుస్తూ, సమాజ అభివృద్ధి కోసం మనం కూడా మన వంతు సేవ చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. "ఓ మహాత్మా, నీకు ఇవే మా ఘన నివాళులు" అంటూ కార్యక్రమంలో పాల్గొన్నవారు భావోద్వేగంతో స్మరించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ అధ్యక్షుడు గికూరు రవీందర్ ముదిరాజ్, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, గ్రామ శాఖ బీసీ అధ్యక్షుడు సుదగోని రాజు గౌడ్, ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కానవేణి శివకుమార్, నాయకులు రామచంద్రం, నరసయ్య, సమ్మయ్య, చంద్రమోహన్ సంపత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై మహనీయుని సేవలను స్మరించారు.

# అచ్చంపేటలో జాబ్ మేళా వాయిదా

**అచ్చంపేట, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో ఈనెల 30న జరగాల్సిన మెగా జాబ్ మేళా స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో వాయిదా పడింది. తదుపరి తేదీ త్వరలో ప్రకటించనున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. సంక్రాంతి పండుగ తర్వాత ఈ జాబ్ మేళా నిర్వహించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ యువత, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుంచి తెలియజేశారు.

# జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి



**అచ్చంపేట, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. పూలే చిత్రపటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వర్ధం సైదులు మాట్లాడుతూ పూలే బడుగు, బలహీన వర్గాలు, దళితుల హక్కుల కోసం నిరంతరం పోరాడారని, సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పి మహిళల కోసం తొలి పాఠశాలను స్థాపించిన ఘనత ఆయనదేనని అన్నారు. అంటరానితనం, కులమత వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన పూలే ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శంకర్ నాయక్, ఎస్. మల్లేష్, రాధాకృష్ణ, సైదమ్మ లక్ష్మి, వెంకటయ్య, పాండు రాము, రాజు పర్వతాల తదితరులు పాల్గొన్నారు.

# మానకొండూరులో రైతుల ఆందోళన



**మానకొండూర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానకొండూర్ మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద కరీంనగం వరంగల్ ప్రధాన రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు. ఐకేపీ అధికారులు ఒక బస్తాకు 40 కిలోలు తూకం వేయాల్సి ఉండగా, నిర్వాహకులు 43 కిలోలు తూకం వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాహకులను ప్రశ్నించగా తగిన సమాధానం ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మానకొండూర్ సీఐ సంజీవ్ రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మట్ట వెంకటయ్య గౌడ్



**వెల్దండ,నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో స్థానిక సంస్థ ఎన్నికల వాతావరణం ఉత్కంఠభరితంగా మారింది. రాజకీయ పార్టీలు గెలుపే లక్ష్యంగా ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉందని, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఓటింగ్ శాతం పెంచుకున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ మాత్రం విజయ బావుట వైపు దూసుకెళ్తోందని నాయకులు పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రతిపాదించిన సర్పంచ్ అభ్యర్థి మట్ట యాదమ్మ, మట్ట వెంకట గౌడ్ ఆధ్వర్యంలో గెలుపు బాటలో దూసుకుపోతున్నారని, నామినేషన్ రోజే వందలాది మంది హాజరై ప్రక్రియలో పాల్గొనడం కాంగ్రెస్ పార్టీ విజయానికి సంకేతమని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు బడుగు బలహీన వర్గాలకు అందుబాటులోకి రావడం, ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం, ఉచిత కరెంటు, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయని, ఈ కారణంగానే ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని వివరించారు.రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగిస్తుందని, వెల్దండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విజయకేతను ఎగరవేయడం ఖాయమని సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ జోష్యం చెప్పారు. అభివృద్ధి పథకాలే స్థానిక సర్పంచ్ అభ్యర్థి మట్ట యాదమ్మ గెలుపు ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# శాతవాహన సైన్స్ కళాశాలలో జ్యోతిరావు పూలే వర్ధంతి




**కరీంనగర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శాతవాహన సైన్స్ కళాశాలలో జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ రమాకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ పూలే సామాజిక సంస్కరణలు, సమానత్వ స్థాపనకు చేసిన కృషి, విద్యారంగానికి అందించిన విశిష్ట సేవలను గుర్తు చేశారు. విద్యార్థులు ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సరైన ప్రణాళికలతో తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి విజయ్‌కుమార్, జేయంతి, జోసఫ్, ప్రసాద్, కిరణ్, రాజు, రమేష్ తో పాటు బోధన, బోధకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు ప్రభుత్వం అండగా

**- అభివృద్ధి పనులకు శ్రీకారం**



**హనుమకొండ, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నవంబర్‌లో వచ్చిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందిస్తోంది. హనుమకొండ, కాజీపేట మండలాల్లో బాధితులకు రేషన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించి నష్టాన్ని అంచనా వేసి రూ.15,000 సహాయం ప్రకటించారని, ఇప్పటికే 2440 మందికి రూ.3.76 కోట్లు, 504 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేశామని తెలిపారు. తరువాత 48, 49వ డివిజన్లలో రూ.300 లక్షలతో రోడ్లు, డ్రైన్లు, పాఠశాల మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, అన్ని డివిజన్లలో సమపాళ్లలో పనులు చేస్తున్నామని నాయిని పేర్కొన్నారు. దర్గా ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, విద్యా%-వైద్య రంగాల్లో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చెన్నూర్‌లో స్థానిక ఎన్నికల ఏర్పాట్లపై మంత్రి వివేక్ సమీక్ష



**చెన్నూర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: చెన్నూర్ క్యాంపు కార్యాలయంలో కోటపల్లి మండల నేతలు, పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి స్థానిక ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై సమగ్ర కసరత్తు జరుగుతోందని, పార్టీ అభిప్రాయాలను ఆధారంగా తీసుకుని మంచి నాయకత్వాన్ని ముందుకు తీసుకురావాలని ఆయన సూచించారు. కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను విజయం సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి మండలం అభివృద్ధిలో ముందుండాలని, అభివృద్ధి పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.

## హుస్నాబాద్‌లో సీఎం పర్యటన ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ సమీక్ష



**హుస్నాబాద్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
డిసెంబర్ 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుస్నాబాద్ పర్యటనలో భాగంగా సభాస్థలి, హెలీప్యాడ్ పరిసర ప్రాంతాలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ పోలీసు ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. సిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో సర్పంచ్ పదవులను వేలం వేస్తున్నట్లు సమాచారం అందుతోందని, అలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఎన్నికల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామ్మూర్తి, ఏసిపి సదానందం, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మారెడ్డి, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## శాతవాహన విశ్వవిద్యాలయంలో కృత్రిమ మేధస్సుపై జాతీయ సదస్సు కరపత్రం ఆవిష్కరణ



**కరీంనగర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4, 5 తేదీల్లో జరగనున్న "భారత ఆర్థిక వ్యవస్థపై కృత్రిమ మేధస్సు ప్రభావం" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు కరపత్రాన్ని ఉపకులపతి ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ రవికుమార్ జాస్తి, ఇతర అధికారులు ఆవిష్కరించారు. సదస్సు కన్వీనర్ కోడూరి శ్రీవాణి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మేధావులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు డిసెంబర్ 30లోపు వ్యాసాలు పంపాలని, ఉత్తమమైన వ్యాసాలను జర్నల్స్‌లో ప్రచురిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ సైన్సెస్ డీన్ వరప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, పద్మావతి, ఉమేరా, సత్యనారాయణ, విద్యాసాగర్ పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

**- సిఐటియు ధర్నా**




**కరీంనగర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైస్ మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, బియ్యం సేకరణ ప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పించాలని సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి మాట్లాడుతూ వరి సేకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికల లోపం వల్ల అనేక మిల్లులు మూతపడే పరిస్థితి ఏర్పడిందని, కస్టమ్ మిల్లింగ్ చార్జీలు బకాయిలు చెల్లించకపోవడం, విద్యుత్ ఫిక్స్‌డ్ చార్జీలు అధికంగా విధించడం వల్ల పరిశ్రమలు కష్టాల్లో ఉన్నాయని తెలిపారు. ఎఫ్సీఐ గోదాములు నిండిపోయి ఉండటంతో కొత్త సేకరణకు కేంద్రం స్పందించడం లేదని, దీంతో మిల్లులు నిలిచిపోయి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బియ్యం సేకరణ ప్రారంభించి మిల్లులు నడిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జ్యోతిరావ్ పూలే ఆశయాలను కొనసాగించడం కాంగ్రెస్ తోనే సాధ్యం



**కరీంనగర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహాత్మ జ్యోతిరావ్ పూలే వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో డిసిసి కార్యాలయం, శాతవాహన యూనివర్సిటీ వద్ద కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పూలే చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు పులి ఆంజనేయులు, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్ మాట్లాడుతూ పూలే కులవివక్ష, నిరక్షరాస్యత, సతీసహగమనంపై పోరాడి మహిళలను అక్షరాస్యత వైపు నడిపించారని, అంబేద్కర్ కు గురువుగా నిలిచారని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. పూలే ఆశయాలను కొనసాగించడం కాంగ్రెస్ ద్వారానే సాధ్యమని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కులవివక్ష నిర్మూలనలో విఫలమైందని వారు విమర్శించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## జ్యోతిరావు పూలే కు నివాళులర్పించిన బిఎస్పి నాయకులు

**హన్మకొండ నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా మహనీయుని విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించిన బహుజన్ సమాజ్ పార్టీ వరంగల్ జిల్లా ఇంచార్జ్ వస్కుల ప్రవీణ్ కుమార్, వరంగల్ జిల్లా అధ్యక్షులు బస్కే నాగరాజ్,వర్ధన్నపేట నియోజకవర్గం ప్రెసిడెంట్ పో లేపాక శ్రీధర్ మారపట్ల నవీన్ కుమార్ వస్కుల కుమారస్వామి తదితరులు నివాళులు అర్పించారు.

# కాంగ్రెస్ పార్టీ బీసీల కళ్లలో మట్టి కొట్టింది

**-ఈటల రాజేందర్**



**హుజురాబాద్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: కమలాపూర్ మండల కేంద్రంలోని తన నివాసంలో గ్రామపంచాయతీ ఎన్నికల అభ్యర్థులు, నాయకులతో సమావేశమైన ఎంపీ ఈటల రాజేందర్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి రెండు సంవత్సరాలుగా డ్రామాలు ఆడి చివరికి కేవలం 17 నుంచి 21 శాతం మాత్రమే ఇచ్చి బీసీలను మోసం చేశారని అన్నారు. గ్రామాల్లో పనిచేసిన సర్పంచులకు బిల్లులు ఇవ్వకపోవడం, నిధులు ఖర్చు చేయకపోవడం వల్ల అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. హుజురాబాద్‌లో 107 గ్రామపంచాయతీలు ఉన్నాయని, కమలాపూర్ మండలంలో మొదటి విడత ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలతో 25 ఏళ్లుగా ఉన్న అనుబంధం వల్ల ఈ ఎన్నికల్లో కూడా తమ అభ్యర్థులను గెలిపిస్తామని, స్వయంగా ప్రజల దగ్గరికి వెళ్లి ఓటు అడుగుతానని రాజేందర్ అన్నారు. గ్రామపంచాయతీలకు రాష్ట్ర నిధులు లేవని, కేంద్రం నిధుల ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని, బీజేపీకి ఓటు వేస్తే మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లపై కలెక్టర్ హైమావతి పర్యటనలు



**సిద్దిపేట, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
2వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి శుక్రవారం గజ్వేల్, ములుగు మండలాల్లో పలు గ్రామపంచాయతీల్లో నామినేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ములుగు మండలం వంటిమామిడి శివారులో ఏర్పాటు చేసిన ఎస్ఎస్ టి శిబిరాన్ని పరిశీలించి వాహనాల తనిఖీ రిజిస్టర్‌ను వెరిఫై చేశారు. ఇప్పటివరకు 96 వాహనాలను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వహించాలని, ట్రాఫిక్ సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. చిన్న తిమ్మాపూర్ గ్రామపంచాయతీ క్లస్టర్‌లో నామినేషన్ల స్వీకరణను పరిశీలిస్తూ అభ్యర్థుల వివరాలు పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతే పత్రాలు స్వీకరించాలని సూచించారు. క్లస్టర్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేసి, అభ్యర్థితో ఇద్దరినే లోనికి అనుమతించాలని పోలీసులకు ఆదేశించారు. రిమ్మనుగూడ గ్రామపంచాయతీ క్లస్టర్‌లో కూడా నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, సాయంత్రం 5 గంటల లోపు లైన్‌లో ఉన్న అభ్యర్థుల పత్రాలనే స్వీకరించాలని, ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించకూడదని అధికారులకు సూచించారు. నామినేషన్ల సమయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా హెల్ప్ డెస్క్‌లో తెలియజేయాలని ఆమె పేర్కొన్నారు.

## బిజెపి సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవంగా గెలిపిస్తే కేంద్రం నుండి పది లక్షల నిధులు



**హుస్నాబాద్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మండల బిజెపి గ్రామీణ అధ్యక్షుడు భూక్యా సంపత్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ జిల్లా అధ్యక్షుడు గంగిడి మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రామగోపాల్ రెడ్డి, ఎన్నికల ఇన్చార్జి లక్కీరెడ్డి తిరుమల హాజరయ్యారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి నిలిచిపోయిందని విమర్శించారు. కేంద్రం నుండి వచ్చిన నిధులతో హుస్నాబాద్ నియోజకవర్గంలో రహదారులు, డబుల్ రోడ్లు, వైకుంఠధామాలు నిర్మించబడ్డాయని తెలిపారు. గ్రామాల్లో బిజెపి అభ్యర్థులను ఏకగ్రీవంగా గెలిపిస్తే కేంద్రం నుండి పది లక్షల నిధులు మంజూరవుతాయని, ప్రజలు బిజెపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన జీవనమే పురోగతికి మార్గం




**పెద్దపల్లి, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాలు 2025 జిల్లా స్థాయి పోటీలు శుక్రవారం పెద్దపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈఓ సురేందర్ విద్యార్థులు కష్టపడి చదివి శాస్త్రీయ వైఖరిని పెంపొందించుకోవాలని, మూఢనమ్మకాలు, దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాజీ ఎంఈఓ డానియల్ శాస్త్రీయ దృక్పథంతోనే మంచి పౌరులుగా ఎదగవచ్చని పేర్కొన్నారు. జిల్లా కన్వీనర్ లక్ష్మణ్ విద్యార్థులు శాస్త్రీయ జ్ఞానంతో పాటు విలువలతో కూడిన జీవన నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. జిల్లాలోని 14 మండలాల నుండి 78 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. మంథని, అంతర్గాం, సోక్రటిక్ హార్ట్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు డిసెంబర్ మూడో వారంలో కరీంనగర్‌లో జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రత్నం, ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, జేవీవీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఫండ్స్ తెచ్చి పల్లెలను అభివృద్ధి చేసేటోళ్లకే పట్టం కట్టండి: రెడ్డబోయిన గోపి



**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించిన జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కేంద్రం ఇచ్చే నిధుల ద్వారానే సాధ్యమని, బండి సంజయ్ ప్రతినిధులను గెలిపిస్తే అభివృద్ధి ఖాయం అవుతుందని అన్నారు. రెండు సంవత్సరాల తరువాత స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగడం మోక్షమని, ఖజానాలో పైసలు లేవని చెప్పిన సీఎం రేవంత్ గ్రామాలను ఎలా అభివృద్ధి చేస్తారో ప్రజలు గమనించాలని సూచించారు. సిరిసిల్ల ప్రజలను గెలిపించిన స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర రాజకీయాల్లో బిజీ అయిపోయారని విమర్శించారు. తంగళ్లపల్లి మండలానికి ఇప్పటి వరకు రూ.1.75 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు, 15 బోర్లు, కమ్యూనిటీ హాల్స్‌కు రూ.30 లక్షలు, సిఎస్ఆర్ నిధులతో అంబులెన్స్‌లు, 20 వేల సైకిళ్లు, పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజులు, ఏకగ్రీవ పంచాయతీలకు రూ.10 లక్షలు బండి సంజయ్ ద్వారా మంజూరయ్యాయని తెలిపారు.గ్రామాల ప్రజలు ఈ విషయాలను గుర్తించి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రం సేవలు ప్రశంసనీయం: సింగిరెడ్డి కృష్ణారెడ్డి



**జమ్మికుంట, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం రైతుల పొలాల్లో సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ చేస్తున్న సేవలు ప్రశంసనీయం అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. చొప్పదండి మండల రైతులతో కలిసి కేంద్రాన్ని సందర్శించిన ఆయనకు శాస్త్రవేత్తలు పురాతన వరి వంగడాలు, సహజ గ్రోత్ ప్రమోటర్లు, గోమూత్రం వినియోగం వంటి ప్రయోగాలను వివరించారు. గత సంవత్సరం 1483 మంది రైతుల పొలాల్లో సహజ వ్యవసాయం ఆచరణలో ఉందని, రానున్న రెండు సంవత్సరాల్లో పదివేల ఎకరాల్లో 6000 మంది రైతులతో సహజ వ్యవసాయాన్ని విస్తరించనున్నట్టు తెలిపారు.రసాయన రహిత పద్ధతులు రైతుల ఆదాయాన్ని పెంచడమే కాక వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడతాయని శాస్త్రవేత్తలు వివరించారు. ప్రతి సంవత్సరం రైతులకు శిక్షణ ఇచ్చి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తున్నామని సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు తెలిపారు. కేంద్ర పరిధిలోని రైతులు జాతీయ అవార్డులు గెలుచుకోవడం పట్ల కృష్ణారెడ్డి అభినందించారు. మోడీ ప్రభుత్వం వ్యవసాయ బడ్జెట్‌ను ఆరు రెట్లు పెంచి, ఎరువుల సబ్సిడీని మూడింతలు పెంచి, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని ఆయన పేర్కొన్నారు. రైతులు కేవీకే సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, కిసాన్ మోర్చా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## దీక్షా దివస్ కార్యక్రమానికి విద్యార్థి లోకాన్ని ఆహ్వానించిన బిఆర్ఎస్వీ నాయకులు




**కరీంనగర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర సాధనలో కెసిఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను స్మరించుకుంటూ డిసెంబర్ 29న దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దీక్షా దివస్ గోడప్రతులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, స్థానిక ఎమ్మెల్యే సూచన ప్రకారం శాతవాహన విశ్వవిద్యాలయం ఎదురుగా కార్యక్రమం జరగనుందని, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నారదాసు లక్ష్మణ్ రావు, చల్లా హరిశంకర్, చుక్కా శ్రీనివాస్, చెన్నమల్ల చైతన్య, బొంకూరి మోహన్, బండ వేణు యాదవ్, నేతి రవి వర్మ, పటేల్ సుధీర్ రెడ్డి, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, మిడిదొడ్డి నవీన్, అన్వేష్, శ్యామ్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## బెల్టు షాపులు నడిపితే కఠిన చర్యలు

- కరీంనగర్ రూరల్ పోలీసులు

**కరీంనగర్ రూరల్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బెల్టు షాపులు నడుపుతున్న వ్యక్తులు, గత ఎన్నికల్లో కేసులు నమోదైన వారిని కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టి లక్ష రూపాయల పూచీకతుపై బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఇకపై ఎవరైనా బెల్టు షాపులు నడిపితే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.

## కుటుంబ నియంత్రణలో వేసక్టమీ

శస్త్ర చికిత్సలు విశ్వసనీయ మార్గం




**కరీంనగర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరుగుతున్న వేసక్టమీ శస్త్ర చికిత్సల క్యాంపును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, కుటుంబ నియంత్రణ ప్రోగ్రాం ఆఫీసర్ సన జవేరియా సందర్శించారు. ఈ సందర్భంగా వారు అర్హులైన దంపతులను ఉద్దేశించి పిల్లలు వద్దనుకున్న వారికి వేసక్టమీ సులభమైన, విశ్వసనీయమైన మార్గమని, శస్త్ర చికిత్స తర్వాత వారం రోజుల విశ్రాంతి తీసుకుంటే మామూలు జీవితాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. కొన్ని నెలల పాటు తాత్కాలిక నియంత్రణ పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ శస్త్ర చికిత్స పురుషుల ఆరోగ్యానికి ఎటువంటి ఇబ్బంది కలిగించదని స్పష్టం చేశారు. క్యాంపులో సీనియర్ వైద్యుడు మహమ్మద్ అలీం శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ రోజు కరీంనగర్ ఆసుపత్రిలో 7, జమ్మికుంటలో 6, మొత్తం 13 మందికి వేసక్టమీ ఆపరేషన్లు జరిగాయి. డిసెంబర్ 4 వరకు కరీంనగర్, హుజురాబాద్, జమ్మికుంట ఆసుపత్రుల్లో క్యాంపులు కొనసాగనున్నాయి. అర్హులైన పురుషులు అధిక సంఖ్యలో పాల్గొని కుటుంబ నియంత్రణ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.

## గ్రామాల అభివృద్ధికై బీజేపీ అభ్యర్థులను గెలిపించండి: సునీల్ రావు



**గంగాధర, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు మాజీ మేయర్ సునీల్ రావు. గంగాధర మండల బీజేపీ శాఖ అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలిస్తే కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎంపీ కోటా నిధుల నుండి ప్రతి గ్రామానికి పది లక్షలు కేటాయిస్తారని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని, అభివృద్ధి కార్యక్రమాలు కేంద్ర నిధుల ద్వారానే జరుగుతున్నాయని ఆయన విమర్శించారు. గంగాధర మండలంలో ఇప్పటికే మూడు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని, రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలిస్తే మరింత నిధులు వస్తాయని సునీల్ రావు తెలిపారు. గ్రామీణ రహదారులు, జాతీయ రహదారులు, 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం ద్వారానే వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జ్యోతిరావ్ పూలే జీవితం అందరికీ ఆదర్శం - ప్రణవ్



**హుజురాబాద్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహాత్మా జ్యోతిరావ్ పూలే జీవితం అందరికీ ఆదర్శమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శుక్రవారం 136వ వర్ధంతి సందర్భంగా సివిల్ హాస్పిటల్ ముందు ప్రధాన చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని, అది అందరి హక్కు అని పూలే నినదించారని, ఆయన స్ఫూర్తితో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తామని ప్రణవ్ తెలిపారు. ఇటీవల విడుదలైన 15 కోట్ల అభివృద్ధి నిధుల్లో భాగంగా హుజురాబాద్ పట్టణంలోని నాలుగు ప్రధాన చౌరస్తాలను కోటి యాభై లక్షలతో అభివృద్ధి చేస్తున్నామని, వాటిలో ఒకదానికి పూలే పేరు పెట్టనున్నట్లు ప్రకటించారు.కార్యక్రమంలో పూలే అభిమానులు, పలు సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## తనుగుల చెక్ డ్యామ్ పేలుడు ఘటనపై జ్యుడిషియల్ ఎంక్వయిరీ కోరిన గంగుల కమలాకర్



**కరీంనగర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: జమ్మికుంట మండలం తనుగుల గ్రామ శివారులో మానేరు నదిపై చెక్ డ్యామ్ పేలుడు ఘటనపై నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం సమర్పించినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. ఇసుక మాఫియా కావాలనే చెక్ డ్యామ్‌ను పేల్చివేసిందని, ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటన కాదని ఆయన పేర్కొన్నారు. కేసులో ఎలాంటి పురోగతి లేకపోవడం వల్ల నిందితులు తప్పించుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టును బహిర్గతం చేయాలని, అవసరమైతే రాష్ట్ర డిజిపి, కేంద్ర హోంశాఖ మంత్రికి కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. చెక్ డ్యాంలు రాష్ట్ర, దేశ సంపద అని వాటిని ధ్వంసం చేయడం అతిపెద్ద నేరమని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో రైల్ రోకోలో కరీంనగర్ నాయకుల అరెస్టు



**కరీంనగర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాగృతి అధ్యక్షురాలు కవితక్క నాయకత్వంలో రైల్ రోకో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కరీంనగర్ జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, ఆటో విభాగం జిల్లా అధ్యక్షుడు కొత్తురి రఘు, సీనియర్ నాయకుడు రంగరవేణి లక్ష్మణ్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

## ఆందోల్ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల సమావేశం



**సంగారెడ్డి, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆందోల్ నియోజకవర్గం పోతులగూడ గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మండలాధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్, వివిధ మండల అధ్యక్షులు హాజరయ్యారు.

# నిరుద్యోగుల కోసం యాదవ ట్రస్ట్ బృహత్ ప్రణాళిక




**పెద్దపల్లి, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లిలో యాదవ చారిటేబుల్ ట్రస్ట్ తొమ్మిదవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాకు యువత నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మారం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి ఉద్యోగ నియామక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువతలో ఎక్కువ మంది ఇంటి వద్దే పనిచేయాలనే ఆసక్తి చూపుతున్నందున, రాబోయే మార్చి నాటికి దాదాపు ఐదు వేల వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగాలను అందించేందుకు ట్రస్ట్ ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం నిరుద్యోగులకు గొప్ప ఊరటనిస్తుందని, కార్యక్రమం విజయవంతం కావడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. జాబ్ మేళా విజయవంతం కావడానికి సహకరించిన సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ నాయకులు, కంపెనీ నిర్వాహకులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ




**కరీంనగర్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్ మండల కొత్తపల్లి సెక్టార్, రాజీవ్ గృహకల్ప అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ మహిళలు తమ సమస్యలను శుక్రవారం సభలో వినిపించుకోవచ్చని, గర్భిణీలు, బాలింతలు తప్పక హాజరుకావాలని సూచించారు. సభలో చర్చల ద్వారా మహిళల్లో మానసిక ఉత్తేజం కలుగుతుందని, హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది హాజరుకావడం వల్ల సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు జరుగుతున్నాయని, షుగర్ బోర్డు ఏర్పాటు చేసి ఆహారంలో చక్కెర వల్ల కలిగే సమస్యలపై అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. డీఎంహెచ్ఓ వెంకటరమణ మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కార్యక్రమంలో 50 రకాల పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రతి మహిళా వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమం చివరలో శ్రీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు. ఈ సభలో అధికారులు, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# డిసెంబర్ 1న తెలంగాణ తొలి అమరవీరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి



**హుస్నాబాద్, నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని డిసెంబర్ 1న గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఉద్యమంలో పోలీస్ వృత్తిలో ఉన్నప్పటికీ కిష్టయ్య తెలంగాణ రాష్ట్రం కోసం తన ప్రాణాలను అర్పించారని, జై తెలంగాణ నినాదంతో సెల్ టవర్ పైకెక్కి త్యాగం చేసిన ఆయనను గుర్తు చేస్తూ ట్యాంక్ బండ్ పై విగ్రహం నెలకొల్పాలని కోరారు. కెసిఆర్ ఆయన కుటుంబానికి అండగా నిలిచారని, ప్రస్తుత ప్రభుత్వం కూడా సహాయం చేయాలని ఆయన అభిలషించారు. ముదిరాజ్ మహాసభ అమరుల చరిత్రను వెలికి తీస్తూ వారి ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

# పవర్ ఇండెక్స్‌లో మూడో స్థానానికి భారత్..

**న్యూఢిల్లీ నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆసియా లో అత్యంత శక్తిమంతమైన దేశాల జాబితాలో భారత్ తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది. ఆస్ట్రేలియా కు చెందిన ప్రఖ్యాత థింక్‌ట్యాంక్ 'లోవీ ఇన్‌స్టిట్యూట్' విడుదల చేసిన 'ఆసియా పవర్ ఇండెక్స్ 2025'లో భారత్ మూడో ర్యాంకు ను కైవసం చేసుకుంది. ఈ జాబితాలో అమెరికా అగ్రస్థానంలో నిలువగా, చైనా రెండో స్థానంలో ఉంది.ఆసియాలోని 27 దేశాలు, ప్రాంతాల సమగ్ర శక్తిసామర్థ్యాలను అంచనా వేస్తూ లోవీ ఇన్‌స్టిట్యూట్ ఏటా ఈ నివేదికను విడుదల చేస్తున్నది. సైనిక సామర్థ్యం, ఆర్థిక సంబంధాలు, దౌత్యపరమైన పలుకుబడి, సాంస్కృతిక ప్రభావం లాంటి 8 అంశాల



పరిధిలోని 131 సూచికల ఆధారంగా ఈ ర్యాంకింగ్‌లను కేటాయించారు. ఈ ఏడాది భారత్ 40 పాయింట్ల స్కోరుతో తన ర్యాంకును పదిలం చేసుకుంది. అంతేగాక తొలిసారి 'మేజర్ పవర్' హోదా అందుకుంది. కరోనా మహమ్మారి తర్వాత బలమైన ఆర్థిక పునరుజ్జీవనం, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ప్రాబల్యం, సైనిక సామర్థ్యం మెరుగుపడటం వంటి కారణాలతో భారత్ శక్తి పెరిగిందని లోవీ ఇన్‌స్టిట్యూట్ తన నివేదికలో పేర్కొంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ ముందున్నప్పటికీ.. చైనాతో పోల్చినప్పుడు మాత్రం ఇంకా వ్యత్యాసం ఉన్నదని నివేదిక స్పష్టంచేసింది. ఈ జాబితాలో 81.7 స్కోరుతో అమెరికా తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగిస్తుండగా.. 73.7 స్కోరుతో చైనా రెండో స్థానంలో నిలిచి అమెరికాతో అంతరాన్ని తగ్గించుకుంటోంది. మరోవైపు 2019 తర్వాత రష్యా తన శక్తిని తిరిగి పుంజుకోవడం ఈ నివేదికలో ఒక ముఖ్యమైన అంశంగా నిలిచింది. జపాన్ శక్తి నిలకడగా ఉండగా.. ఆగ్నేయాసియా దేశాలు స్వల్ప మెరుగుదలను కనబర్చాయి.

# గాజాలో ఆగని ఇజ్రాయిల్ విధ్వంసకాండ

**న్యూఢిల్లీ నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఇజ్రాయిల్ గాజాలో పాలస్తీనియన్లపై ఇప్పటికీ మారణహోమానికి పాల్పడుతోందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ స్పష్టం చేసింది. గత నెలలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. ఇజ్రాయిల్ గాజాలో ఇప్పటికీ మారణహోమం కొనసాగిస్తోందని పేర్కొంది. ఇజ్రాయిల్ మరియు హమాస్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వంలో సున్నితమైన కాల్పుల విరమణ రెండేళ్ల యుద్ధం తర్వాత అక్టోబర్ 10నుండి అమల్లోకి వచ్చింది."కాల్పుల విరమణ గాజాలో జీవితం సాధారణ స్థితికి చేరుకుంటుందనే ప్రమాదకరమైన భ్రమను సృష్టించే అవకాశం ఉంది " అని ఆమ్నెస్టీ చీఫ్ ఆగెస్ కల్లామర్డ్ పేర్కొన్నారు. " ఇజ్రాయిల్ ప్రభుత్వం, సైన్యం తమ దాడుల స్థాయిని తగ్గించి, గాజాలోకి పరిమిత మొత్తంలో మానవతా సాయాన్ని అనుమతించినప్పటికీ.. ప్రపంచం మోసపోకూడదు. ఇజ్రాయిల్ మారణహోమం ముగియలేదు " అని అన్నారు. దేశాన్ని, జాతిని, జాతిసంబంధమైన లేదా మతపరమైన సమూహాన్ని పూర్తిగా లేదా పాక్షికంగా నాశనం చేయాలనే ఉద్దేశంతో చేసే ఐదు చర్యలలో ఏచర్యనైనా 'మారణహోమం'గానే పరిగణించాలని 1948



ఐక్యరాజ్యసమితి నిర్వచించింది. గాజాలోని పాలస్తీనియన్ల భౌతిక విధ్వంసానికి దారితీసేలా ఉద్దేశపూర్వకంగా జీవన పరిస్థితులపై ఆంక్షలు విధించడం సహా .. మూడు చర్యల ద్వారా ఇజ్రాయిల్ గాజాలో మారణహోమానికి పాల్పడుతోందని 2024 డిసెంబర్‌లో, ఆమ్నెస్టీ తేల్చింది. గురువారం ఈ నివేదికను నవీకరిస్తూ ఈ విధంగా వెల్లడించింది. "పౌర జనాభా మనుగడకు అవసరమైన సామాగ్రి మరియు సేవల పునరుద్ధరణపై ఇజ్రాయిల్ ఆంక్షలు విధిస్తూనే ఉంది. దాడుల స్థాయి తగ్గినప్పటికీ, కొన్ని పరిమిత మెరుగుదలలు ఉన్నప్పటికీ, గాజాలో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ అమలు జరుపుతున్న విధానాల్లో అర్థవంతమైన మార్పు లేదు మరియు ఇజ్రాయిల్ ఉద్దేశ్యం మారిందని సూచించడానికి ఎటువంటి ఆధారాలు లేవు". "గాజాలో ఇజ్రాయిల్ ప్రవర్తనా విధానం, పాలస్తీనియన్ల ప్రాణాలను రక్షించే సహాయాన్ని ఉద్దేశపూర్వకంగా, చట్టవిరుద్ధంగా తిరస్కరించడం సహా వీరిలో చాలా మంది గాయపడ్డారు, పోషకాహార లోపంతో ఉన్నారు. మరియు తీవ్రమైన వ్యాధుల ప్రమాదంలో ఉన్నారు. వారి మనుగడకు ముప్పు కలిగిస్తూనే ఉన్నారు" అని కల్లామర్డ్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 2025లో, ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్ "గాజాలో మారణహోమం జరుగుతోందని అని తేల్చింది. 1948 మారణహోమం జాబితా చేసిన "అక్టోబర్ 2023 నుండి ఇజ్రాయిల్ ప్రభుత్వం, దళాలు 'ఐదు జాతి విధ్వంసక చర్యల్లో నాలుగు" చర్యలకు పాల్పడ్డారు" అని దర్యాప్తు తేల్చింది

# ప్రపంచంలోనే ఎత్తైన రాముడి కాంస్య విగ్రహం..

## గోవాలో ఆవిష్కరించిన ప్రధాని..!

**న్యూఢిల్లీ నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనతో హిందువుల దశాబ్దాల కలను సాకారం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ మరో చరిత్రకు నాంది పలికారు. ఇటీవలే అక్కడి రామాలయంపై కాషాయం జెండాను ఎగురేసిన మోడీ ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రాముడి భారీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గోవాలోని చరిత్రాత్మక శ్రీ సంస్థాన్ గోకర్ణ్ జోవోత్తమ్ మఠం లో గురువారం 77 అడుగుల ఎత్తైన రాముడి కాంస్య విగ్రహా న్ని ఆయన ప్రారంభించారు.దక్షిణ గోవాలోని ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీ సంస్థాన్ గోకర్ణ్ జోవోత్తమ్ మఠం ఏర్పడి నవంబర్ 28 గురువారం



నాటికి 550వ సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ ప్రత్యేక సందర్భంగా పునస్కరించుకొని ప్రధాని మఠంలో 77 అడుగుల ఎత్తైన కోదండరాముడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ.. 'అయోధ్య రామాలయంపై కాషాయం జెండాను ఎగరేసిన రెండుమూడు రోజులకే రాముడి భారీ విగ్రహాన్ని ఆవిష్కరించే అదృష్టం తనకు దక్కడం చాలా సంతోషంగా ఉంద'ని అన్నారు. గుజరాత్‌లో సర్దార్ పటేల్ ఏకతా స్టాచ్యూ తయారు చేసిన ప్రముఖ శిల్పకారుడు రామ్ సుతార్ ఈ భారీ రాముడి కాంస్య విగ్రహాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.

# ఇదంతా పెద్ద కుట్ర

**ప్రజలు అప్రమత్తంగా వుండాలి : సర్ ప్రక్రియపై అఖిలేశ్ విమర్శ**

**లక్నో నవంబర్ 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎన్నికల కమిషన్ అమలు చేస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ శుక్రవారం తాజాగా దాడి చేశారు. ఈ దేశ ప్రజలకు వ్యతిరేకంగా ఇందులో పెద్ద కుట్ర దాగి వుందని, వలసవాద కాలం నాటి కన్నా అధ్వాన్నమైన పరిస్థితుల్లోకి పౌరులను నెట్టేస్తుందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎక్స్‌లో 20సెకండ్ల వీడియో పెట్టారు. బీజేపీ అమలు చేస్తున్న ఈ మెగా కుట్రకు వ్యతిరేకంగా మనమంతా సమైక్యంగా వుండి



ఎండగట్టాలని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. "ఇదంతా ప్రజాస్వామ్యాన్ని మోసం చేయడమే, ప్రజలు అప్రమత్తంగా వుండాలి, ఈరోజు ఓట్లలో కోత వుంటుంది, రేపు పేర్లను భూ రికార్డులు, రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు, రిజర్వేషన్లు, చివరకు బ్యాంక్ ఖాతాలు, లాకర్ల నుంచి తొలగిస్తారని అఖిలేశ్ ఎక్స్ పోస్టులో విమర్శించారు. ప్రజలు తక్షణమే మేల్కొని, ప్రతి ఒక్క ఓటును కాపాడుకోవాలన్నారు. బీజేపీ నేతలు, మిత్రపక్షాలు కలిసి బహిరంగంగా చేస్తున్న ఈ దోపిడీ నుండి దేశాన్ని కాపాడాలన్నారు. మన ఓటు ద్వారా మన గుర్తింపును కాపాడుకోవాలన్నారు. లేనిపక్షంలో మనల్ని బయటివారుగా వారు ప్రకటిస్తారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర ప్రతినిధి హరీశ్చంద్ర శ్రీవాత్సవ ఈ ప్రచారాన్ని తిప్పికొట్టారు. తన పోస్టు ద్వారా ప్రజల్లో ఒక రకమైన భయం, ఆందోళన వ్యాప్తి చేయడానికి ఎస్పీ చీఫ్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇది డిజిటల్ భారత్ అని, ప్రజలకు వాస్తవం తెలుసని, వారు తప్పుదారి పట్టరని అన్నారు. ప్రస్తుతం 9 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ కొనసాగుతోంది.



## హాట్ అందాలకు రెచ్చిపోతున్న దివ్యభారతి



# ప్రభాస్ 'ది రాజా సాబ్' హిందీ వెర్షన్ సాంగ్‌కి సూపర్బ్ రెస్పాన్స్..

## ఇప్పుడు ట్రెండింగ్‌లో..!..


పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న రొమాంటిక్ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ది రాజా సాబ్'పై దేశవ్యాప్తంగా భారీ హైప్ నెలకొంది.సంక్రాంతి 2026 బరిలో జనవరి 9వ తేదీన విడుదల కానున్న ఈ సినిమాపై ప్రేక్షకులు, ఫ్యాన్స్, ట్రేడ్ వర్గాలలో అంచనాలు భారీగా ఉన్నాయి. 'రెబల్ సాబ్' పాటతో దేశం మొత్తం షేక్ అయింది. సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభమయ్యాక విడుదలైన మొదటి సాంగ్ 'రెబల్ సాబ్' సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ప్రత్యేకంగా హిందీ వెర్షన్ భారీ స్థాయిలో వైరల్ అవుతోంది.యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, స్పాటిఫై లాంటివి మొత్తం ఈ పాటతో నిండిపోయాయి. ప్రభాస్ ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, తమన్ ఇచ్చిన మాస్ బీట్‌లు, స్టెప్పులు ఇవన్నీ కలిసి ఈ సాంగ్‌ను దేశవ్యాప్తంగా సూపర్ హిట్ చేశాయి. ఈ పాటకు ఇప్పటికే డజన్ల కొద్దీ కవర్ వెర్షన్లు, డాన్స్ వీడియోలు వస్తుండటంతో సాంగ్ మరింత ట్రెండ్ అవుతుంది. 'ది రాజా సాబ్'లో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ముగ్గురు హీరోయిన్లు ఉండటం వల్ల రొమాన్స్, ఎంటర్టైన్‌మెంట్ డోస్ కూడా ఎక్కువగానే ఉంటుందని చెబుతున్నారు. సినిమాకు సంబంధించిన బిజినెస్ వివరాలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యాయి.తాజా సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్ -తెలంగాణ ప్రాంతాల్లో మాత్రమే?130 కోట్లకు పైగా ప్రీ - రిలీజ్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఒక హారర్ ఫాంటసీ కామెడీ జానర్ సినిమా కోసం ఇంత భారీ రేంజ్ రావడం చాలా అరుదు.దీనితో ప్రభాస్ మార్కెట్ ఎలాంటి స్థాయిలో ఉందో మరోసారి నిరూపితమయ్యింది. దర్శకుడు మారుతి ప్రత్యేకమైన కామెడీ టైమింగ్‌తో ఎంతగానో అలరిస్తాడు అన్న విషయం తెలిసిందే. అతని స్టైల్, ప్రభాస్ స్టార్ పవర్ కలిసివస్తే సినిమా అల్టిమేట్ ఎంటర్‌టైనర్‌గా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భారీ ప్రొడక్షన్ విలువలు కూడా మరో పెద్ద హైలైట్. సంక్రాంతి 2026లో ఈ సినిమా సంచలనాలు సృష్టిస్తుంది.

# తలైవా సినిమాలో పవర్‌ఫుల్ రోల్?



కంటెంట్ నచ్చితే తప్ప క్యారెక్టర్‌కి ఓకే చెప్పని సాయిపల్లవి ఇప్పుడు ఓ ప్రస్టేజియస్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. అది కూడా సామాన్యమైన సినిమా కాదు. సూపర్‌స్టార్ రజనీకాంత్ 173వ సినిమా. 'పార్కింగ్' సినిమాతో విమర్శకుల ప్రశంసలందుకున్న రామ్‌కుమార్ బాలకృష్ణన్ ఈ చిత్రానికి దర్శకుడు. ఇటీవలే ఆయన సాయిపల్లవిని కలిసి కథ వినిపించారట. కథ విన్న వెంటనే ఆమె ఓకే అనేశారాట. దీన్ని బట్టి అది ఎంత గొప్ప కంటెంట్ అయ్యుంటుందో అర్థం చేసుకోవచ్చు.ఇన్నాళ్లూ తన జనరేషన్ హీరోలతోనే నటించిన సాయిపల్లవి.. తొలిసారి రజనీకాంత్ వంటి సీనియర్ హీరోతో నటిస్తుండటం ప్రస్తుతం కోలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. ఇందులో సాయిపల్లవి పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందట. ఆమెతోపాటు వర్సటైల్ డైరెక్టర్ కదిర్ కూడా ఇందులో కీలక పాత్ర పోషించనున్నారట. ప్రీప్రొడక్షన్ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. తలైవా ఇమేజ్‌కి తగ్గట్టుగా ఉండే ఈ మాస్ ఎంటర్‌టైనర్‌కి అనిరుధ్ స్వరాలందిస్తున్నారు.


# కూతురి పేరు ప్రకటించిన కియారా-సిద్ధార్థ్ మల్హోత్రా.. పేరు ఏంటంటే.!





బాలీవుడ్ స్టార్ కపుల్ కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా తల్లిదండ్రులుగా మారిన తర్వాత తొలిసారిగా తమ కూతురి ఫొటోను పంచుకున్నారు. అంతేకాకుండా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తమ ముద్దుల కూతురి పేరును కూడా ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ జంట తమ కుమార్తెకు సారాయహ్ మల్హోత్రా అని నామకరణం చేసినట్లు ప్రకటించారు. కియారా మరియు సిద్ధార్థ్ ఇద్దరూ తమ తమ సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో ఈ విషయాన్ని తెలియజేస్తూ.. కూతురి కాళ్లని పట్టుకుని ఉన్న ఒక మధురమైన ఫొటోను షేర్ చేశారు. "మా ప్రార్థనల నుంచి మా చేతుల్లోకి మా దివ్య ఆశీర్వాదం, మా యువరాణి సారాయహ్ మల్హోత్రా" అంటూ ఈ పోస్ట్ కిందా క్యాప్షన్ ఇచ్చారు. ఈ ఫొటో పోస్ట్ చేసిన కొద్దిసేపటికే బాలీవుడ్ ప్రముఖులు, అభిమానులు ఈ క్యూట్ బేబీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

# బాక్సాఫీస్ వద్ద గుజరాతీ సినిమా ప్రభంజనం!



చాలా తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కి బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు సాధించిన సినిమాలు చాలా అరుదుగా ఉంటాయి. అయితే అలాంటి అద్భుతాన్ని సృష్టించింది గుజరాతీ చిత్రం 'లాలో-కృష్ణ సదా సహాయతే' . ఈ సినిమా ప్రస్తుతం గుజరాత్ సినీ పరిశ్రమలో సంచలనం సృష్టిస్తోంది. కేవలం రూ.50 లక్షల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై అనుహ్య విజయాన్ని సాధించడమే కాకుండా ఈ చిత్రం ఇప్పటివరకు రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టింది. దీంతో గుజరాతీ సినిమాల బాక్సాఫీస్ చరిత్రలోనే ఒక అరుదైన రికార్డుగా నిలిచింది. సినిమా కంటెంట్, కథనానికి ప్రేక్షకులు ఫిదా కావడంతో ఈ స్థాయిలో వసూళ్లు దక్కాయి. ఈ సినిమాకు అంకిట్ సఖియా దర్శకత్వం వహించగా.. జాతీయ అవార్డు గ్రహీత మానసి పరేఖ్ నిర్మాతగా వ్యవహరించాడు. కారన్ జోషి ప్రధాన పాత్రలో నటించగా.. రీవా రాచ్ కథానాయికగా నటించింది. శ్రుహద్ గోస్వామి కీలక పాత్రల్లో నటించాడు.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఈ చిత్ర కథానాయకుడు (కారన్ జోషి) ఒక ఆటో డ్రైవర్. అతను ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతూ ఉంటాడు. అంతేకాక గతంలో జరిగిన కొన్ని విషయాలు అతడిని వెంటాడుతుంటాయి, ఆ బాధ నుంచి అతను ఎప్పుడూ బయటపడలేకపోతుంటాడు. ఈ క్రమంలోనే అనుకోకుండా ఒక రోజు ఆ ఆటో డ్రైవర్ ఒక ఫామ్‌హౌస్‌లో చిక్కుకుపోతాడు. బయటికి రావడానికి అతను అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ సాధ్యం కాదు. సరిగ్గా ఆ సమయంలోనే అతడికి మానవ రూపంలో ఉన్న శ్రీకృష్ణుడు దర్శనం ఇస్తారు. ఆ తర్వాత వీరిద్దరి మధ్య స్నేహం మొదలవుతుంది. శ్రీకృష్ణుడు తన అద్భుతమైన లీలలు, మాటల ద్వారా ఆ ఆటో డ్రైవర్‌ను ముక్తి మార్గం వైపు నడిచేలా చేస్తాడు. శ్రీకృష్ణుడి అండదండలతో ఆ డ్రైవర్ తన గతం తాలూకూ బాధలు, తన మనసులోని అలజడిని అధిగమిస్తాడు. కొత్త ఆశలు, ధైర్యంతో జీవితంలో ముందుకు సాగడం ప్రారంభిస్తాడు. ఒక ఆటో డ్రైవర్ జీవితంలో దైవ శక్తి జోక్యం, భక్తి, స్నేహంతో అతను ఎలా మార్పు చెందాడు అనేదే ఈ 'లాలో-కృష్ణ సదా సహాయతే' చిత్ర కథాంశం. ఈ భావోద్వేగపూరితమైన కథే సినిమా విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది.